ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

బుధవారం 17 సెప్టెంబరు 2025

కటకటాల వెనుక నుంచి కన్న కూతురికి పుట్టిన రోజు కానుక

వ్యసనంతో పతనమైన మాజీ సిపాయి.. కన్నీటి ప్రమాణం

తూమకుంట చెక్‌పోస్టు బ్యాంకు చోరీ కేసులో పట్టుబడ్డ నిందితుడు



బ్యాంకు చోరీ కేసు నిందితుడు అనీల్‌కుమార్ పన్వార్

తల్లీ.. ఇక దొంగతనం చేయను..!

సర్..

ఈ రోజు నా కూతురు పుట్టిన రోజు. తనంటే నాకు చాలా ఇష్టం. ఒకసారి ఫోన్‌లో మాట్లాడిస్తారా..?' ఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ, పోలీసు అధికారిని అడిగాడు అనిల్ కుమార్ పన్వార్..! అతను కాస్త కరుడుగట్టిన దొంగ. అంతకంటే ముందు దేశ సేవ చేసిన సైనికుడు.

'అట్ల ఇవ్వడం కుదరదు..! అయినా ఏం మాట్లాడుతావ్ నీ కూతురుతో..? దొంగతనం చేసి పోలీసుల అదుపులో ఉన్నానని చెబుతావా..?' అని ప్రశ్నించారు ఆ అధికారి.

'ప్లీజ్ సర్..! ఒక్కసారి మాట్లాడించండి..! తను బాగా చదువుతుంది. 95 శాతానికి పైగా మార్కులతో డిగ్రీ పూర్తి చేసింది. తనను ఐఏఎస్ లేదా ఐపీఎస్ అధికారిగా చూడాలన్నది నా కల..! నా ఫోన్ కాల్ కోసం తను ఎదురుచూస్తూ ఉంటుంది..' అని వేడుకున్నాడు.

'కూతురు' అనగానే పోలీసు అధికారి మనసు కరిగింది. అతని చేతికి ఫోన్ ఇచ్చాడు.

కూతురుకు ఫోన్ చేశాడు అనిల్..! అటువైపు నుంచి తన గారాలపట్టి ఫోన్ ఎత్తింది. 'తల్లీ.. నేనే..! హ్యాపీ బర్త్ డే..' అని శుభాకాంక్షలు తెలిపాడు. 'ఈ పుట్టినరోజుకు నీకు అతి పెద్ద బహుమతి ఇస్తున్నాను..! అదేమిటో తెలుసా..? ఇకపై నేను దొంగతనాలు చేయను..' అని అన్నాడు. అతని భావోద్వేగం చూసి పోలీసుల కళ్లు చెమర్చాయి.

హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో.. ఈ ఏడాది ఆగస్టు 30వ తేదీ చోటు చేసుకున్న అపురూప సన్నివేశం ఇది. తూముకుంట చెక్‌పోస్టు సమీపంలోని ఎస్‌బీఐలో చొరబడి.. 11 కేజీల బంగారాన్ని ఎత్తుకుపోయిన కేసు నిందితుడు అనిల్ కుమార్ పన్వార్..! ఒకనాటి సైనికుడు..! రిటైర్ కాగానే చెడు సావాసాలు అతన్ని దొంగగా మార్చాయి. గడిచిన 16 ఏళ్లలో 14 బ్యాంకులలో 19 కిలోల బంగారాన్ని చోరీ చేశాడు. ఎనిమిదేళ్ల జైలు జీవితం గడిపాడు.

ఇప్పుడు కూతురుకు ఇచ్చిన మాటను ఈ మాజీ సిపాయి నిలబెట్టుకుంటాడా..? కొత్త జీవితం ప్రారంభిస్తాడా? కాలమే చెప్పాలి..!

(వివరాలు 6లో..)

ఐక్యతతోనే డిమాండ్ల సాధన

● ఏపీఎన్జీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్





ర్యాలీలో పాల్గొన్న ఎన్జీఓ తాలూకా సంఘం నాయకులు, ప్రసంగిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

పుట్టపర్తి, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ఐక్యంగా ముందుకెళితే డిమాండ్లను సాధించుకోవచ్చని ఏపీఎన్జీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ పేర్కొన్నారు. పట్టణంలో మంగళవారం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌వీ జానకిరామయ్య కల్యాణ మండపంలో సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడుతూ...వైసీపీ ప్రభుత్వంలో తీవ్రంగా నష్టపోయామనీ, కూటమి పాలనలో కొంతవరకు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించుకున్నామన్నారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలపై సీఎం చంద్రబాబుతో సంప్రదించి ఇంతవరకు రూ.7,500 కోట్లు రాబట్టామన్నారు. అనంతరం లింగా రామ్మోహన్ అధ్యక్షతన జిల్లా అడ్‌హక్ కమిటీని ఏర్పాటుచేశారు. త్వరలోనే నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీ రమణ, నాయకులు ఆత్మారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, రామప్ప పాల్గొన్నారు.

వరాలిచ్చే స్వామివారి సేవకు భక్తులు పోటీ పడి ముందుకు వస్తున్నారు. దేవస్థానం అభివృద్ధి పనులకు కోట్ల రూపాయలను సమకూరుస్తున్నారు. అధికారులు అడగడమే తరువాయి.. 'ఎంత ఖర్చవుతుందో అంచనా వేయండి. పనులు చేపట్టేందుకు ఏర్పాట్లు చేసుకోండి. డబ్బులు మేమిస్తాం..' అని అంటున్నారు. ఫలితంగా.. దశాబ్దాలుగా ఆలోచనలు, ప్రతిపాదనలకు పరిమితమైన పనులు కార్యరూపం దాలుస్తున్నాయి. భక్తుల ఉత్సాహం.. అధికారుల చొరవతో కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయం సర్వాంగ సుందరంగా మారేందుకు సిద్ధమౌతోంది.

ఆనతినియ్యరా.. స్వామీ..!



కసాపురం దేవస్థానం


కలశం నమూనా



బంగారు కలశాలు

పూర్తిగా రాతితో.. గర్భాలయం

ఆలయ గర్భగుడి రాతి మండపం స్కెచ్



- ఆలయ గోపురాలకు స్వర్ణ కలశాలు
- ఈశాన్యంలో కోనేటి నిర్మాణం
- 55 గదులతో వసతి సముదాయం
- యాగశాల, గోశాల, ప్రసాదాల తయారీ షెడ్డు నిర్మాణం
- కుంభాభిషేకానికి ఉత్తరాయణంలో ముహూర్తం
- కసాపురం నెట్టికంటి ఆలయ అభివృద్ధికి భక్తుల ఉత్సాహం
- ఖర్చు అంచనాలను సిద్ధం చేస్తున్న ఆలయ అధికారులు

గుంతకల్లు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం అభివృద్ధికి అడుగులుపడ్డాయి. మాస్టర్ ప్లాన్ తయారు కాలేదన్న కారణంగా పుష్కర కాలం కిందట ఆగిన పనులలో కదలిక వచ్చింది. ఆలయంలో ముఖ్యమైన నిర్మాణ కార్యక్రమాలకు అధికారులు స్కెచ్‌లను తయారుచేశారు. కలశాల ఏర్పాటుకు దాతలను సిద్ధం చేసుకున్నారు. వాటి తయారీ అంచనా వ్యయంతో ప్రతిపాదనలను తయారు చేశారు. అసంపూర్తిగా నిలిచిన (మిగతా 6లో...)

కసాపురం ఆలయ గోపురాలకు బంగారు కలశాలను ఏర్పాటు చేయాలనేది దశాబ్దాల కల. గోపురాల నిర్మాణం మూడు దశాబ్దాల క్రితం జరిగింది. కానీ కలశాలను ఏర్పాటు చేయలేదు. కలశాలకు అవసరమైన బంగారాన్ని ఇస్తామని భక్తులు ముందుకొచ్చినా, ముందడుగు పడలేదు. నెల క్రితం ఈఓగా బాధ్యతలు స్వీకరించిన విజయరాజు, స్వర్ణ కలశాల ఏర్పాటుకు దాతను వెతికి పట్టుకున్నారు. ఆలయంలో 25 కలశాలను ఏర్పాటు చేయాల్సి ఉందని, ఎంత ఖర్చవుతుందో అంచనా వేస్తామనిఆయన తెలిపారు. ఆలయాల్లో ప్రతిష్ఠలు, శుభకార్యాలను ఉత్తరాయన కాలంలో చేపడతారు. వచ్చే ఫిబ్రవరి నాటికి కలశాలను ఏర్పాటు చేసి, ఆలయంలో తొలిసారిగా కుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహించడానికి కార్యాచరణ రూపొంది స్తామని ఈఓ తెలిపారు.

డీఎస్సీలో మరో మాయ..!

ఎంపిక జాబితాలో అర్హుడి పేరు మాయం

- తరువాతి స్థానాల్లో ఉన్నవారికి చోటు
- అధికారుల ముందు బాధితుడి గోడు



ఆంజనేయులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 నియామకాల ప్రక్రియలో మాయలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. పదేపదే సర్టిఫికెట్ల పరిశీలన చేసినా.. ఎంపిక జాబితాలో అనర్హులకు చోటు కల్పించడం, అర్హుల పేర్లు లేకపోవడం వ్యవహారాలు బయట పడుతున్నాయి. బుద్ధిమాంద్యం (ఎంఐ) కేటగిరీలో ఓ అభ్యర్థి అనర్హుడు అని వైద్యుడు సర్టిఫికెట్ ఇచ్చారు. దానిని కూడా విద్యాశాఖాధికారులే తీసుకొచ్చారు. అయినా ఆ అభ్యర్థికి ఎంఐ కేటగిరీ కింద సోషల్ సబ్జెక్టులో ఎంపిక చేసి (మిగతా 6లో...)

అర్హులందరికీ పథకాలు

ఆధారాలతో వస్తే న్యాయం

జడ్పీ సమావేశంలో ఎంపీ అంబికా



వాగ్వాదం చేసుకుంటున్న ఎంపీ, జడ్పీ చైర్‌పర్సన్..

ఆర్డీటీ అంశంపై చైర్ పర్సన్‌తో వాగ్వాదం

వైద్యం, యూరియా సమస్యలను లేవనెత్తిన సభ్యులు

(7లో...)

తల్లీ.. మీకు వందనం..!

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, బ్రెయిన్ డెడ్ అయిన కుమారుడి అవయవాలను కన్నతల్లి దానం చేశారు. ఇప్పటికే భర్తను పోగొట్టుకుని పుట్టింట్లో ఉన్న ఆమె.. ఒక్కగానొక్క కొడుకు దూరం కావడంతో అంతులేని విషాదంలో ఉన్నారు. అయినా, తన కుమారుడి అవయవాలు కొందరి ప్రాణాలను నిలబెడతాయని వైద్యులు చెప్పగానే.. సమ్మతించి.. గొప్ప మనసును చాటుకున్నారు.

(వివరాలు మెయిన్‌లో..)



నవీన్ (ఫైల్)

మీ పిన్ని ఊరికెళ్లింది..!

అర్ధరాత్రి యువతికి వేధింపులు

వైసీపీ బాబాయ్‌పై కేసు నమోదు

(వివరాలు మెయిన్‌లో)



ఉప సర్పంచ్ వెంకటరెడ్డి

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు బ్రేకులు..!



ధర్మవరం ఆస్పత్రి ఆవరణలో ఉన్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్

వేధిస్తున్న డ్రైవర్ల కొరత, మరమ్మతులు

పట్టించుకోని కాంట్రాక్టు సంస్థ

చంటిబిడ్డ తల్లులకు తప్పని తిప్పలు

6



సదస్సులో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

శాంతిభద్రతలతోనే అభివృద్ధి

కలెక్టర్ల సదస్సులో సీఎం

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వెలగపూడిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన సదస్సు రెండోరోజు మంగళవారం జిల్లా నుంచి కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్ పాల్గొన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణపై సీఎం దిశానిర్దేశం చేశారు. నేరాలు తగ్గితేనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఆ దిశగా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శాంతిభద్రతల విషయంలో రాజీపడవద్దని పోలీసుశాఖకు సీఎం సూచించారు.



ఎస్ఆర్ఐటీలో బీటెక్ విద్యార్థిని

ఆత్మహత్య

7

పుట్టపర్తి చేరుకున్న మలేషియా భక్తులు

పుట్టపర్తి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):పర్తి యాత్ర పేరుతో మలేషియా భక్తులు మంగళవారం పుట్టపర్తికి చేరుకున్నారు. 200 మంది భక్తులు ప్రశాంతి నిలయానికి వచ్చారు. రెండు రోజులపాటు సాయికుల్వంత్ సభామండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

చేలు.. కన్నీళ్లు..!

పెరిగిపోతున్న పెట్టుబడులు.. వెంటాడుతున్న వర్షాభావం

పచ్చని పైర్లలో కళకళలాడిన భూములు.. బీళ్లుగా మారి.. కళావిహీనంగా తయారవుతున్నాయి. పెరిగిపోతున్న పెట్టుబుడులు.. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు పెట్టాలంటేనే అన్నదాతలు జంకుతున్నారు. కనీసం ప్రత్యామ్నాయ పంటలు కూడా వేయట్లేదు. దీంతో ఏడాదికేడాదికీ పంటల సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. పంట చేలు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి.

పంటలు పెట్టేందుకు జంకుతున్న రైతులు

తగ్గిపోతున్న సాగు విస్తీర్ణం

బీడుగా మారుతున్న భూములు



బీడుగా వదిలేసిన భూములు

మడకశిర, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సాగునీటి వనరులు లేకపోవడంతో రైతులు ప్రధానంగా ఖరీఫ్ పంటల సాగుపైనే ఆధార పడుతున్నారు. పెట్టుబడులు పెరిగిపోతుండడంతో రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అష్టకష్టాలు పడి, అప్పులు చేసి పంటలు సాగు చేసినా ఏదో ఒక కారణంతో అవి దెబ్బతిని తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. ఇటు వర్షాభావం, మరోపక్క వన్యప్రాణులు పంటలపై దాడులు చేయడం, పెట్టుబడులు పెరిగిపోతుండడంతో కొంతమంది రైతులు పంటల సాగుకు ఆసక్తి చూపట్లేదు. దీంతో నియోజకర్గంలో ఏడాదికేడాదికీ సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. పంటలు సాగవకపోవడంతో భూములు బండబారిపోతున్నాయి. చేలను బీళ్లగా ఉంచలేక కొందరు పంటలు పెడితే వర్షాభావంతో అవి దెబ్బతిని, తీవ్ర నష్టం మిగులుస్తున్నాయి. నియోజకవర్గంలో పదేళ్ల క్రితం ఖరీఫ్‌లో 42 వేల హెక్టార్లలో వేరుశనగ, ఇతర పంటలు సాగుచేసేవారు. ప్రస్తుతం సాధారణ సాగు విస్తీర్ణం 34 వేల హెక్టార్లకు పడిపోయింది. అందులో కూడా 24 వేల హెక్టార్లలోనే పంటలు సాగైనట్లు తెలుస్తోంది. వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 24 వేల హెక్టార్లు కాగా.. ఈ ఏడాది సగానికి పడిపోయింది. 12 వేల హెక్టార్లలోనే పంటలు పెట్టారు. అందులో ప్రత్యామ్నాయ పంటలకు కూడా పెట్టుబడి అధికమవుతుండడంతో చాలామంది రైతులు పంటలు సాగు చేయక బీడుగా వదిలేశారు.

పెరిగిపోయిన పెట్టుబడులు

పంటల సాగుకు పెట్టుబడులు భారీగా పెరిగిపోయాయి. ఎకరాలో వేరుశనగ పంట పెట్టడానికి రూ.25వేల వరకు ఖర్చవుతోంది. పొలాలను దక్కులు చేయడానికి, కలుపు తీయడానికి, గుంటకలు వేయడానికి, పంట కోతకు రూ.10 వేల నుంచి రూ.12 వేలదాకా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. వర్షాభావ పరిస్థితుల్లో పంట చేతికొస్తుందన్న నమ్మకం రైతుల్లో సన్నగిల్లింది. పంట దక్కినా.. ధరలు ఉంటాయన్న నమ్మకం లేదు. ఈ పరిస్థితుల్లో పంటల సాగుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. పంటల సాగుకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తే.. కూలీల ఖర్చు తగ్గుతుందని రైతులు అంటున్నారు.

కలుపు తీతకు ఐదు వేలు ఖర్చు



వేరుశనగ పంటలో కలుపు తీతకు రూ.5 వేలదాకా ఖర్చవుతోంది. పంటలో కలుపు అధికంగా ఉంటే మరో వెయ్యి అదనంగా వెచ్చించాల్సిందే. ఉపాధి హామీ పథకాన్ని పంటల సాగుకు అనుసంధానం చేస్తే కూలీల ఖర్చు తగ్గుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. లేదంటే పంటలు వేయలేని పరిస్థితి నెలకొంది.

-నాగరాజు, రైతు, జీరిగేపల్లి

వ్యసనంతో పతనం..!

దొంగగా మారిన విశ్రాంత సైనికుడు.. ఆర్మీ నుంచి వచ్చాక 14 బ్యాంకులలో చోరీ

ఎనిమిదేళ్లు బయట.. ఎనిమిదేళ్లు జైలు జీవితం
తూమకుంట ఎస్‌బీఐ చోరీ కేసులో మళ్లీ జైలుకు..
ఉన్నత కుటుంబంలో పుట్టిన అనిల్ కుమార్ పన్వార్

హిందూపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తూమకుంట చెక్ పోస్టు వద్ద ఎస్‌బీఐలో చోరీ గుర్తు ఉంది కదా..? సెలవు రోజున బ్యాంకులో చొరబడి.. ఏకంగా 11 కిలోల బంగారాన్ని, రూ.40 లక్షల నగదును ఎత్తుకుపోయారు. ఈ కేసులో ఇద్దరు నిందితులు కాగా, వీరిలో ఒకరు మాజీ సైనికుడు..! చెడు సావాసాలు ఎంతటి గొప్పవారినైనా పతనం చేస్తాయి అనేందుకు ఇతని జీవితమే నిదర్శనం. ఒకనాడు చైనా సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించిన వీరుడు.. ఇప్పుడు కటకటాల వెనుక శిక్ష అనుభవిస్తున్నాడు. అతని పేరు అనిల్ కుమార్ పన్వార్. హరియాణాలోని గుర్గావ్ జిల్లా మారుతీ కుంజ్ అనిల్ గ్రామం. మిలటరీ నుంచి తిరిగి వచ్చిన తరువాత అనిల్ చర్ఖీదాద్రి జిల్లా సాన్వర్ గ్రామంలో స్థిరపడ్డాడు. అనిల్ తండ్రి జైపాల్ సింగ్ మూడున్నర దశాబ్దాలపాటు మారుతీ కుంజ్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా సేవలు అందించారు. ఆయనకు ఇద్దరు కుమారులు కాగా, అనిల్‌ను దేశ సేవకోసం పంపించారు. మరో కుమారుడికి వ్యవసాయం, ఊరి పెద్దరికం బాధ్యతలను అప్పగించారు. నాలుగు వేలకు పైగా జనాభా ఉన్న ఆ పంచాయతీలో వీరి కుటుంబానికి ఎంతో మంచి పేరు ఉంది. అనిల్ ఏడేళ్లకుపైగా సైన్యంలో పనిచేశాడు. రిటైర్మెంట్ తరువాత తిరిగి వచ్చాడు. అప్పుడే స్థానికంగా పేకాటరాయుళ్లతో పరిచయం ఏర్పడింది. జూదంలో డబ్బులు పోగొట్టుకున్నాడు. భారీగా అప్పులు చేశాడు. వాటిని తీర్చేందుకు, ఎక్కువ డబ్బు సంపాదించేందుకు అడ్డదారులు వెతుక్కున్నాడు. మొదట సొంతూరు సమీపంలోని ఓ బ్యాంకులో చోరీ చేశాడు. ఆ తరువాత మరో 13 బ్యాంకులలో చోరీలు చేశాడు. మధ్య మధ్యలో జైలుకు వెళ్లి వచ్చాడు. కానీ మార్పు రాలేదు.


సీసీ టీవీ ఫుటేజీలో నిందితుడు

వచ్చిన ఏడాదిలోనే..

అనిల్ కుమార్ 2007లో ఆర్మీ నుంచి తిరిగి వచ్చాడు. ఆ తరువాత ఏడాదికే బ్యాంకులలో చోరీలను మొదలు పెట్టాడు. చోరీ చేయడం.. పోలీసులకు దొరకడం.. జైలుకు వెళ్లడం.. అక్కడే మరో చోరీకి స్కెచ్ వేయడం.. బయటకు వచ్చిన నెలలోనే మళ్లీ బ్యాంకు చోరీ చేయడం పరిపాటిగా మారిపోయింది. మొదటి దొంగతనం కేసులో అనిల్‌ను అరెస్టు చేసే సమయంలో పోలీసులు అతని తండ్రికి సమాచారం ఇచ్చారు. కొడుకు ముఖం చూసేందుకూ ఆయన ఇష్టపడలేదని సమాచారం. ఆయన సోదరుడు సైతం 'అతన్ని తీసుకెళ్లి ఏమైనా చేసుకోండి..' అని ఆవేదన వ్యక్తం చేశాడని సమాచారం. తమిళనాడులోని ఓ బ్యాంకులో చోరీ చేసిన కేసులో అనిల్ ఐదున్నరేళ్ల జైలు శిక్ష అనుభవించాడు. ఆర్మీ నుంచి బయటకు వచ్చిన ఈ 16 ఏళ్లలో ఎనిమిదేళ్లకు పైగా జైలు జీవితాన్ని గడిపాడు. బయట ఉన్న ఎనిమిదేళ్లలో 14 బ్యాంకులలో చోరీలు చేశాడు. మొత్తం 19 కిలోల బంగారాన్ని ఎత్తుకుపోయాడు. ఈ ఏడాది జూన్ 12న జైలు నుంచి బయటకు వచ్చాడు. జూలై 26న హిందూపురం మండలంలోని తూమకుంట చెక్‌పోస్టు వద్ద ఉన్న ఎస్‌బీఐ బ్రాంచిలో చోరీ చేశాడు.

రెండు సెకెన్ల వీడియో పట్టించింది..

జూలై 26వ తేదీ రాత్రి తూమకుంట చెక్‌పోస్టు సమీపంలోని బ్యాంకులో చోరీ జరిగింది. రెండు రోజులు సెలవు ఉండటంతో.. 28వ తేదీన చోరీ వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో పోలీసులకు ఎలాంటి ఆధారాలూ లభించలేదు. భారీ చోరీ కావడంతో అప్పటి ఎస్పీ రత్న, డీఎస్పీ మహేశ్, అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సుమారు 15రోజులపాటు కష్టపడ్డారు. చోరీకి ముందు నెలరోజులకు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీలను సేకరించారు. సుమారు 3 వేల వీడియో క్లిప్పింగులను పరిశీలించారు. పది వేల ఫోన్ నంబర్ల వివరాలను ఆరాతీశారు. చివరకు తూమకుంట ప్రాంతంలో రికార్డు అయిన కేవలం రెండు సెకెన్ల వీడియో ఆధారంగా నిందితుడిని గుర్తించారు. 2018లో అనంతపురంలో జరిగిన బ్యాంకు దొంగతనం కేసులో ఉన్న అనిల్ అందులో ఉన్నాడు. ఆ కేసు దర్యాప్తు బృందంలో సీఐ ఆంజనేయులు (అప్పట్లో ఎస్‌ఐ) ఉన్నారు. దీంతో అతనిపై అనుమానం వచ్చింది. అతని స్వగ్రామంలో ఆధారాలను సేకరించారు. సాంకేతికత ఆధారంగా జూలై 27 నుంచి నెలరోజుల పాటు అతని కదలికలను సేకరించారు. ఒకే ఫోన్ నంబరుతో 30మందికి పైగా లాయర్లతో మాట్లాడినట్లు గుర్తించారు. ఆ నంబరు ఆధారంగా కూపీ లాగారు. నాలుగు రోజులపాటు అక్కడే తిష్టవేసి, రేయింబవళ్లు వేటాడి అనిల్‌ను పట్టుకున్నారు.

శాటిలైట్ ఫోన్‌తో..

బ్యాంకు దోపిడీలు చేసి పట్టుబడిన ప్రతిసారీ అనిల్ అప్‌డేట్ అయ్యాడు. పోలీసులు తనను ఎలా పట్టుకున్నారో తెలుసుకుని, పట్టుబడకుండా ఉండేందుకు విన్నూత్న ఆలోచన చేసేవాడు. తూమకుంట చెక్ పోస్టు వద్ద బ్యాంకులో చోరీకి ఇదేలా ఆలోచించాడు. సెల్‌ఫోన్ వాడితే గుర్తిస్తారని, ఢిల్లీకి వెళ్లి రూ.7 వేలతో శాటిలైట్ ఫోన్ కొనుగోలు చేశాడు. అందులో సిమ్‌కార్డు ఉండదు. నెట్‌వర్క్ సమస్య ఉండదు. ఎక్కడి నుంచైనా మరో సాటిలైట్ ఫోన్‌కు కాల్ చేసే సదుపాయం ఉంటుంది. ఈ కాల్స్‌ను ఎవరూ గుర్తించలేరు. తూమకుంట చెక్‌పోస్టు వద్ద బ్యాంకు చోరీ సమయంలో తాను శాటిలైట్ ఫోన్ వాడానని అనిల్ పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. కోయంబత్తూరు జైలులో పరిచయమైన రాజస్థాన్‌కు చెందిన మరో నిందితుడితో కలిసి తూమకుంట చెక్‌పోస్టులో బ్యాంకు దొంగతనానికి అనిల్ ప్లాన్ వేసి, అమలు చేశాడు. అనిల్ ప్రస్తుతం హిందూపురం సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. రాజస్థాన్‌కు చెందిన మరో నిందితుడిని అక్కడి పోలీసులు వేరే కేసులో జైలులో ఉంచారు. ఇక్కడ చోరీ చేసిన బంగారంలో అధిక శాతం అతనివద్దే ఉన్నట్లు సమాచారం.

చాలా పద్ధతిగా..

బ్యాంకులో చోరీ చేసేందుకు సెలవు రోజులనే అనిల్ ఎంచుకునేవాడు. కనీసం రెండు రోజులు సెలవు ఉన్నప్పుడే చొరబడేవాడు. కుదువ పెట్టిన బంగారాన్ని మాత్రమే ఎత్తుకుపోయేవాడు. పర్సనల్ లాకర్లను టచ్ చేసేవాడు కాదు. తాకట్టు బంగారానికి ఇన్సూరెన్స్ ఉంటుందని, అందుకే ఆ బంగారాన్నే ఎత్తుకుపోయేవాడినని అనిల్ పోలీసుల విచారణలో ఒప్పుకున్నట్లు తెలిసింది.


సొంతూరు వద్ద పొలంలో దాచిన చోరీ బంగారాన్ని స్వాధీనం చేసుకుంటున్న సీఐ ఆంజనేయులు, పురం వీఆర్వోలు

పశుసంవర్ధక శాఖలో 15 మంది జేడీలకు పోస్టింగ్‌లు

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుసంవర్ధక శాఖలో డిప్యూటీ డైరెక్టర్ల నుంచి జాయింట్ డైరెక్టర్లుగా తాత్కాలిక పదోన్నతి పొందిన 15మందికి పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పి.ప్రేమ్‌చంద్-అనంతపురం జేడీ, జి.సుబ్బమ్మ- విజయవాడ ఎండీ కాప్, కె.శ్రీనివాసులు-విజయవాడ వీఎస్ఎస్‌హెచ్, ఎం.రత్నజ్యోతి-డైరెక్టరేట్, బి.చంద్రశేఖర్-చింతలదీవి ఎన్‌కేబీసీ, కె.మురళీకృష్ణ-విజయనగరం జేడీ, కె.భూపాల్‌రెడ్డి-డైరెక్టరేట్, డి.శంకరరావు-విశాఖపట్నం జేడీ, ప్రసాదరావు-ఏలూరు జేడీ, వెంకటేశ్వరరావు- ఒంగోలు జేడీ, టి.వి.సుధాకర్-డైరెక్టరేట్, ఉమామహేశ్వరి-చిత్తూరు జేడీ, వి.దుర్గాప్రసన్నబాబు-డైరెక్టరేట్, కెవీవీ సత్యనారాయణ-గుంటూరు జేడీ, పి.వెంకటరమణ-శ్రీకాకుళం జేడీగా నియమితులయ్యారు. కాగా తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ నియంత్రణలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు రాయల్‌రెడ్డి, శివసాగర్‌రెడ్డిల డిప్యూటేషన్‌ను మరో ఏడాది పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

టమోటా కిలో రూ.16

అనంతపురంరూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక టమోటా మార్కెట్‌లో మంగళవారం టమోటా కిలో రూ.16తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.9, సరాసరి ధర రూ.12తో విక్రయాలు జరిగాయని పేర్కొన్నారు. మార్కెట్‌కు 1650 టన్నుల టమోటాలు వచ్చినట్లు తెలిపారు.

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం సీజనల్ చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జ్ కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరిధర రూ.12వేలు పలికాయని వివరించారు. మార్కెట్‌కు మొత్తంగా 548 టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు తెలిపారు.

మళ్లీ వెతలు..!

● జేఎన్‌టీయూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆందోళన ● వేతనాల చెల్లింపు బాధ్యతలు ఏజెన్సీకి అప్పగింత ● ఈనెల నుంచే అమలులోకి.. ● నేటికీ అందని వేతనాలు



అనంతపురంరూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పరిధిలో వారంతా చిరుద్యోగులు. నెలవారీగా సకాలంలో వచ్చే వేతనాలతో జీవనం నెట్టుకొస్తున్నారు. ఏజెన్సీ అనే మాట వారిపై పిడుగులా పడింది. అభద్రత అనే భయం పుట్టుకొచ్చింది. భవిష్యత్తులో ఎప్పుడు, ఎలాంటి పరిణామాలు చవిచూడాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. జేఎన్‌టీయూ పరిధిలో అవుట్ సోర్సింగ్ కింద వందలాది మంది పనిచేస్తున్నారు. వీరి వేతన చెల్లింపు ప్రక్రియ మళ్లీ ఏజెన్సీ వద్దకు చేరింది. ఈనెల నుంచి కార్తికేయ అనే ఏజెన్సీ ద్వారా ఉద్యోగులకు వేతనాలు చెల్లించనున్నారు. దీంతో సంబంధిత వర్గాల్లో నెలవారిగా వేతన చెల్లింపు, ఉద్యోగ భద్రత, ఇతరత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వేతనాలు సక్రమంగా చెల్లించకపోతే తమ పరిస్థితి ఏంటన్న అభిప్రాయాలు ఆయావర్గాల నుంచి వినిపిస్తున్నాయి.

600 మందికిపైగా ఉద్యోగులు

జేఎన్‌టీయూలో వివిధ ఉద్యోగాల్లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియమించుకున్నారు. పదుల సంఖ్యలో ప్రారంభమైన ఉద్యోగుల సంఖ్య ప్రస్తుతం వందల్లోకి చేరింది. యూనివర్సిటీలో 274, పులివెందుల ఇంజనీరింగ్ కళాశాలో 150, కలికిరి ఇంజనీరింగ్ కళాశాలలో 120, క్యాంపస్ ఇంజనీరింగ్ కళాశాలలో 80, ఓటీపీఆర్‌ఐలో 26 మంది కలిపి మొత్తం 650 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు.

ఆప్కాస్ నుంచి ఏజెన్సీకి..

అనంతపురం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల నుంచి విశ్వవిద్యాలయం రూపాంతరం చెందిన అనంతరం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ఏజెన్సీల ద్వారా చెల్లిస్తుండేవారు. గత ప్రభుత్వం ఆప్కాస్‌ను ఏర్పాటు చేసి, నేరుగా వేతనాలు చెల్లించేది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత జేఎన్‌టీయూ ద్వారా గత నెల వరకు వేతనాలు చెల్లించారు. కోతలు లేకుండా వేతనం మొత్తం ప్రతినెలా రెండు, మూడు తేదీల్లోనే అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఖాతాల్లో జమ అయ్యేది. దీంతో వారికి వేతనం గురించి చింతించాల్సిన అవసరం లేకుండా పోయింది. ప్రస్తుతం మళ్లీ ఏజెన్సీల ద్వారా వేతనాల చెల్లింపునకు చర్యలు మొదలయ్యాయి. దీంతో ఉద్యోగుల్లో ఆందోళనలు నెలకొన్నాయి. ప్రభుత్వం నేరుగా వేతనాలు చెల్లిస్తే బాగుంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.

నేటికీ అందని వేతనాలు

ఈనెల నుంచి విశ్వవిద్యాలయం పరిధిలోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రస్తుత ఏజెన్సీ ద్వారా వేతన చెల్లింపులు ప్రారంభం కావాల్సి ఉంది. ఇప్పటి వరకు సదరు ఉద్యోగుల ఖాతాల్లోకి వేతనాలు జమలేదు. దీంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. రానున్న రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందో అన్న భయం ఆయా వర్గాల్లో నెలకొంది.

ఉద్యోగులకు ఇబ్బందులు ఉండవు



అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మొదటి నుంచి ఏజెన్సీల ద్వారానే వేతనాలు చెల్లింపులు జరుగుతున్నాయి. ఏజెన్సీలకు వర్సిటీ వేతనాలు చెల్లిస్తుంది. ఉద్యోగులకు ఇబ్బందులు ఉండవు.

- కృష్ణయ్య, రిజిస్ట్రార్, జేఎన్‌టీయూ


తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు బ్రేకులు..!

● వేధిస్తున్న డ్రైవర్ల కొరత ● మరమ్మతులు పట్టించుకోని కాంట్రాక్టు సంస్థ ● చంటిబిడ్డ తల్లులకు తప్పని తిప్పలు

కొత్తచెరువు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి)ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం తరువాత తల్లీబిడ్డను ఇంటికి సురక్షితంగా తీసుకెళ్లే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు బ్రేకులు పడుతున్నాయి. వేతనాలు తక్కువగా ఇస్తుండడంతో డ్రైవర్లు రావట్లేదు. వాహనాలు మరమ్మతుల బారినపడితే చేయించేవారు కూడా లేరు. దీంతో వాహనాలు ఆగిపోతున్నాయి. చంటిబిడ్డ తల్లులు ఇబ్బందులు పడుతున్నారు.

వైసీపీ నిర్లక్ష్యం

గత వైసీపీ ప్రభుత్వం వాహనాల నిర్వహణను అరబిందో సంస్థకు అప్పజెప్పింది. కంపెనీకి నిధులు విడుదల చేయకపోవడంతో వాహనాల నిర్వహణ భారంగా మారింది. వాహనాల మరమ్మతులు చేయించలేని, డ్రైవర్లకు సైతం జీతాలు ఇవ్వలేని దుస్థితి తలెత్తిందని సదరు కంపెనీ ప్రతినిధులు వాపోతున్నారు. డ్రైవర్లు కూడా రాకపోవడంతో వాహనాలు చాలా ఆస్పత్రుల్లో నిలిచిపోయాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 36 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఉన్నాయి. వీటిలో అనంతకు 24, శ్రీసత్యసాయి జిల్లాకు 12 కేటాయించారు. అంతపురం సర్వజనాస్పత్రి పరిధిలో 13 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు నడుస్తున్నాయి. 6 వాహనాలు మరమ్మతుల బారిన పడ్డాయి. మిగిలిన వాటిని ఆయా పట్టణాలు, మండలాల్లోని వైద్య కేంద్రాలకు కేటాయించారు. శ్రీ సత్యసాయి జిల్లాలో 12 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు నడుస్తున్నాయి. ఒకటి మాత్రమే మరమ్మతులకు వచ్చింది. మిగిలిన వాటిలో హిందూపురం జిల్లా ఆస్పత్రి పరిధిలో 3, కదిరిలో 2, ముదిగుబ్బ, పెనుకొండ, రొళ్ల, మడకశిర, ధర్మవరం, గోరంట్ల మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున పనిచేస్తున్నాయి.


ధర్మవరం ఆస్పత్రి ఆవరణలో ఉన్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్

ఆసక్తి చూపని డ్రైవర్లు

వైసీపీ హయాంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు నెలకు రూ.7,870 చెల్లిస్తుండేవారు. ఆ వేతనానికి పనిచేసేందుకు డ్రైవర్లు ముందుకు రావట్లేదు. దీంతో వాహనాల నిర్వహణ కష్టంగా మారింది. ఈ సమస్యను గుర్తించిన కూటమి ప్రభుత్వం డ్రైవర్ల వేతనాన్ని రూ.9,153కి పెంచింది. ఆ జీతం కూడా చాలట్లేదని డ్రైవర్లు అంటున్నారు. కియలో రూ.20 వేలు పైగా వేతనం ఇస్తుండడంతో ఎక్కువ భాగం డ్రైవర్లు ఆ కంపెనీలోని బస్సులకు వెళ్తున్నారు. దీంతో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలకు డ్రైవర్ల కొరత వెంటాడుతున్నట్లు తెలుస్తోంది.

ఒక్కోసారి ఇద్దరిని..

ఆస్పత్రి నుంచి తల్లీబిడ్డను ఇంటి వద్దకు వదిలిపెడితే రూ.895 అరబిందో సంస్థకు ప్రభుత్వం చెల్లిస్తుంది. జిల్లాలో కొన్నిచోట తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఇద్దరేసి తల్లీబిడ్డలను తరలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకేసారి ఇద్దరిని తరలించి రెండు బిల్లులను ప్రభుత్వం నుంచి కాజేస్తున్నారన్న విమర్శలు వినబడుతున్నాయి. డ్రైవర్లు కూడా చంటిబిడ్డ కుటుంబ సభ్యుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారని కొంతమంది బాధితులు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో సమస్యలను పరిష్కరించి, తల్లీబిడ్డ వాహనాలను అందుబాటులో ఉంచాలని జనం కోరుతున్నారు.

వాహనాలను వినియోగంలోకి తెస్తాం

ఉమ్మడి జిల్లాలో నిలిచిపోయిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలకు మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తెచ్చేలా ఇప్పటికే అరబిందో సంస్థతో చర్చించాం. ఒకేసారి వాహనంలో ఇద్దరేసి తల్లీబిడ్డలను తరలించేవారిపై నిఘాపెడతాం. డ్రైవర్లు డబ్బు డిమాండ్ చేస్తున్నట్లు మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం.

-శంకర్, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల జిల్లా కోఆర్డినేటర్

ఆనతినియ్యరా.. స్వామీ..!

(5వ పేజీ తరువాయి)

గోపురాలకు స్వర్ణ కలశాల ఏర్పాటు, కుంభాభిషేకానికి ముహూర్తాన్ని నిర్ణయించారు. దక్షిణాయణ కాలం పూర్తయిన వెంటనే, ఫిబ్రవరిలో స్వర్ణ కలశాల స్థాపన, స్వామివారి ఆలయంలో తొలిసారి కుంభాభిషేకాన్ని నిర్వహించడానికి రంగం సిద్ధంచేశారు. భక్తుల వసతి గదులు, కల్యాణ మండపాలకు మరమ్మతులు చేపట్టారు.

స్కెచ్ సిద్ధం

నెట్టికంటి ఆంజనేయుడి గర్భాలయాన్ని పూర్తిగా రాతితో జీర్ణోద్ధరణ చేసేందుకు స్కెచ్‌ను తయారు చేశారు. రాతి గర్భగుడిని నిర్మించడానికి గుంతకల్లు ఆర్యవైశ్య సంఘం సంసిద్ధతను వ్యక్తంచేసింది. దీంతో అధికారులు ఖర్చు అంచనాలను సిద్ధం చేస్తున్నారు. రాతి గర్భగుడి నిర్మాణానికి రూ.2 కోట్లు అవుతుందని భావిస్తున్నామని, ఆ మొత్తాన్ని సమకూరుస్తామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా జగదీశ్, కార్యదర్శి కృపాకర్ తెలిపారు. ఆలయానికి ఈశాన్యంలో కోనేటిని నిర్మించడానికి పువ్వాడి చంద్రశేఖర్ ముందుకు వచ్చారు. దాదాపు 8 సెంట్ల స్థలాన్ని కానుకగా ఇచ్చేందుకు అంగీకారం తెలిపారు. దీంతో కోనేటి స్కెచ్‌ను, ఖర్చు అంచనాలను అధికారులు తయారు చేస్తున్నారు. ఆలయం లోపల ఉన్న యాగశాలను ప్రస్తుత గోశాల పక్కకు మార్చడానికి, గోశాల స్థలంలో ప్రసాదాల తయారీ షెడ్డును, ప్రసాదాల అమ్మకపు కౌంటర్లను నిర్మించడానికి ప్రతిపాదనలను తయారు చేస్తున్నామని ఈఓ వివరించారు. మరో ఖాళీ స్థలంలో గోశాలను నిర్మిస్తున్నారు. అన్నదాన శాలను పోలీసు చెక్‌పోస్టు వద్ద నిర్మించాలని నిర్ణయించారు. అక్కడ ఉన్న (దేవస్థానం ఎదుట) దుకాణాలను వేరేచోటుకు తరలిస్తామని ఈఓ తెలిపారు.

గదులకు మరమ్మతులు

ఆలయంలో సమస్యాత్మకంగా మారిన వసతి గదుల మరమ్మతులను చేపట్టారు. ఆలయానికి తూర్పున ఉన్న ఏసీ కాటేజీ మరమ్మతులు జరుగుతున్నాయి. వీటికి ఆనుకుని ఉన్న గంగా నిలయం కల్యాణ మండపానికి మరమ్మతులను పూర్తిచేసి, రంగులు వేస్తున్నారు. ఆలయానికి ఎదురుగా ఉన్న కేసరి సదనానికి త్వరలో మరమ్మతులు చేపట్టనున్నారు. బెంగళూరుకు చెందిన ఓ దాత 55 గదులతో వసతి సముదాయాన్ని నిర్మించడానికి ముందుకు వచ్చారని ఈఓ తెలిపారు. ఈ నిర్మాణానికి సంబంధించిన ప్లాన్, ఖర్చు అంచనాలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. దేవస్థానం లోపల ఉన్న దేవదాయశాఖ కార్యాలయం, ధర్మకర్త కార్యాలయం, లడ్డూ తయారీ కేంద్రాన్ని వెలుపలకు తరలిస్తామని ఈఓ తెలిపారు.

దాతలతోనే అభివృద్ధి..



ఆలయానికి ఆదాయం కంటే వ్యయం అధికంగా ఉంటోంది. దేవస్థానానికి హుండీలు, కౌలు, అద్దెలు, టిక్కెట్లు తదితరాల ద్వారా రూ.12 కోట్ల ఆదాయం వస్తోంది. కానీ అంతకు మించి జీతాలు, ప్రసాదాల తయారీ, చట్టపరమైన చెల్లింపులకు ఖర్చు అవుతోంది. అభివృద్ధి జరగాలంటే దాతల వల్ల మాత్రమే సాధ్యమౌతుంది. అందుకే వారి సహాయాన్ని అర్థించాము. నెలలోనే దాతల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. తొలుత బంగారు కలశాల ఏర్పాటు, కుంభాభిషేకం సంకల్పించాము. దాతల ఆసక్తిమేరకు చెప్పిన అభివృద్ధి కార్యక్రమాలన్నీ చేపడతాం. భక్తుల వసతికి తొలి ప్రాధాన్యం ఇస్తాం.

-విజయరాజు, ఈఓ, కసాపురం దేవస్థానం

అమరావతికి నూతన టీచర్లు

● జిల్లా నుంచి 45 బస్సుల ఏర్పాటు
● రేపు ఉదయం 6 గంటలకు పీవీకేకే కళాశాలకు చేరుకోవాలి
● 19న సీఎం, విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు
● డీఈఓ ప్రసాద్‌బాబు


మాట్లాడుతున్న డీఈఓలు ప్రసాద్‌బాబు, క్రిష్ణయ్య

అనంతపురం విద్య, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో టీచర్ ఉద్యోగాలు సాధించిన వారందరూ అమరావతికి బయల్దేరాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్‌బాబు తెలిపారు. స్థానిక జిల్లా కార్యాలయంలో శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖాధికారి క్రిష్ణయ్య, డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు, డీఎస్సీ సెక్షన్ ఏడీ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ ఆదినారాయణతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. డీఎస్సీలో 755 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వారందరికీ అమరావతిలో నియామక పత్రాలు అందజేస్తారన్నారు. ఈనెల 18వ తేదీన ఉదయం 6 గంటలకు అనంతపురంలోని ఆలమూరు రోడ్డులోగల పీవీకేకే కళాశాలకు అభ్యర్థులు చేరుకోవాలన్నారు. అభ్యర్థితోపాటు కుటుంబ సభ్యుడు ఒకరు తప్పకుండా రావాల్సి ఉంటుందన్నారు. జోనల్‌లో పీజీటీ, టీజీటీ పోస్టులకు ఎంపికై జిల్లాలో ఉన్నవారు కూడా ఇక్కడికే రావాల్సి ఉంటుందన్నారు. 45 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 19వ తేదీ అమరావతిలో సీఎం నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేస్తారన్నారు. ఈనెల 22 నుంచి 29వ తేదీ వరకు అభ్యర్థులకు ఆయా సబ్జెక్టుల్లో జిల్లాలోనే శిక్షణ ఇస్తామన్నారు. ఆ తర్వాత పాఠశాలలకు పోస్టు కేటాయించి, పంపుతామని డీఈఓ ప్రసాద్‌బాబు వివరించారు.

డీఎస్సీలో మరో మాయ..!

(5వ పేజీ తరువాయి)

పంపారు. ఆయన పేరును చూసి విద్యాశాఖ యంత్రాంగమే నివ్వెరపోయింది. అది మరువకనే డీఎస్సీ ఎంపిక జాబితాలో అర్హత ఉన్న ఓ అభ్యర్థికి పోస్టు దక్కలేదు. ఆయన కన్నా తక్కువ మార్కులు వచ్చిన వారికి పోస్టింగ్ కల్పించి, ఎంపిక జాబితాలో పెట్టారు. ఇది వెలుగులోకి రావడంతో విద్యాశాఖ అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

అర్హత ఉన్నా.. పేరు మాయం..

ధర్మవరానికి చెందిన ఏ ఆంజనేయులు (బీసీ-ఏ) డీఎస్సీ రాశారు. ఆయనకు రాష్ట్రశాఖ నుంచి వెరిఫికేషన్‌కు హాజరుకావాలని కాల్‌లెటర్ వచ్చింది. పరిశీలనకు డిగ్రీలకు సంబంధించి అన్ని సర్టిఫికెట్లు ఒరిజనల్ ఉన్నా.. సెకండ్ డిగ్రీకి సంబంధించిన మార్కుల మెమో ఒరిజినల్ తీసుకురాలేదు. దీంతో ఆయన పరిశీలనను పెండింగ్‌లో ఉంచి ఒరిజినల్ డిగ్రీ మార్కుల మెమో తీసుకురావాలని చెప్పడంతో వెనుదిరిగి వెళ్లారు. ఆ తర్వాత తాను చదివిన ఎస్వీ యూనివర్సిటీకి వెళ్లి ఒరిజినల్ మార్కుల మెమో కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 5వ తేదీన తిరిగి డీఈఓ కార్యాలయం నుంచి ఆంజనేయులుకు ఫోన్ చేసి, సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు. 8వ తేదీన ఆయన యూనివర్సిటీలో ఒరిజినల్ మార్కుల మెమో తీసుకుని, రాత్రికి డీఈఓ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే అధికారులు ఇళ్లకు వెళ్లిపోవడంతో 9వ తేదీ ఉదయమే మళ్లీ డీఈఓ కార్యాలయానికి వచ్చి ఒరిజినల్ సర్టిఫికెట్లను అందజేశారు. అదేరోజే వాటిని పరిశీలించిన కమిటీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి పంపింది. డీఎస్సీ ఎంపిక జాబితాలో ఆయన పేరులేదు. ఆయన కన్నా తక్కువ మార్కులు వచ్చిన వారి పేర్లు జాబితాలో ఉన్నాయి. ఆంజనేయులు డీఎస్సీ ఇంగ్లిష్ సబ్జెక్టులో 76.28 మార్కులు సాధించి 48వ ర్యాంకులో ఉన్నారు. ఈ సబ్జెక్టులో ఎంపిక జాబితా ఆధారంగా 75.73 మార్కులతో 49వ ర్యాంకులో ఉన్న ధనుంజయ అనే అభ్యర్థి వరకు ఓపెన్ కేటగిరీలోనే ఎంపికయ్యారు. ధనుంజయ కంటే ఆంజనేయులుకు ఎక్కువ మార్కులు ఉన్నాయి. ర్యాంకు 48 కాబట్టి ఆంజనేయులు ఇంగ్లిష్‌లో ఓపెన్ విభాగంలోనే ఎంపికకావాల్సి ఉంది. అయినా.. ఆయన పేరు కనిపించలేదు. బీసీ-ఏ కేటగిరీలో ఆంజనేయులు కంటే తక్కువ మార్కులు ఉన్నవారికి పోస్టింగ్ ఇచ్చారు. ఆంజనేయులు పేరు మాత్రం జాబితాలో లేదు. దీంతో ఆయన.. డీఈఓ కార్యాలయానికి వచ్చి, విద్యాశాఖ అధికారులను కలిసి తనకు వాటిల్లిన అన్యాయాన్ని వివరించారు. అర్హుడిని పోస్టుకు ఎంపిక చేయకుండా విద్యాశాఖ మాయాజాలం ప్రదర్శించడం విమర్శలకు తావిస్తోంది.

ఆంజనేయులుకు న్యాయం చేస్తాం

ఆంజనేయులుకు ఇంగ్లిష్ సబ్జెక్టులో అర్హత ఉంది. ఎంపిక జాబితాలో పేరు రావాల్సి ఉంది. విషయాన్ని కమిషనర్‌తోపాటు డీఎస్సీ విభాగ రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. టెక్నికల్‌గా పొరపాటు జరిగింది. తప్పకుండా సరిదిద్ది, ఆంజనేయులుకు పోస్టింగ్ ఇస్తాం.

-ప్రసాద్‌బాబు, డీఈఓ

ఉన్నత విద్యామండలిలో ఇద్దరు వైస్ చైర్మన్ల నియామకం

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలిలో రెండు వైస్ చైర్మన్ పోస్టులను భర్తీ చేస్తూ ఉన్నత విద్యాశాఖ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. వైస్ చైర్మన్-1గా శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్.విజయభాస్కరరావును, వైస్ చైర్‌పర్సన్-2గా నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ రత్నశీల మణిని నియమించింది. వీరి పదవీ కాలం మూడేళ్లు. గత ప్రభుత్వం నియమించిన ఇద్దరు వైస్ చైర్మన్లలో ఒకరి పదవీకాలం ఇటీవల ముగియగా, మరొకరు రాజీనామా చేశారు. ఆయా స్థానాలను కూటమి ప్రభుత్వం ఇప్పుడు భర్తీ చేసింది.

1,482 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా



అనంతపురం అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు 1,482 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద వ్యాగిన్లలో వచ్చిన యూరియా బస్తాలను ఏడీఏ మంగళవారం పరిశీలించారు. ఏపీ మార్క్‌ఫెడ్‌కు 899, ప్రైవేటు డీలర్లకు 583 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేస్తామన్నారు. 900 మెట్రిక్ టన్నుల వైట్ పొటాష్ సరఫరా వచ్చిందన్నారు.

క్రైం కార్నర్

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

హాస్టల్ గదిలో చున్నీతో ఉరి



ధనలక్ష్మి (ఫైల్)

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రోటరీపురం సమీపంలోని ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థిని కె. ధనలక్ష్మి(21) ఆత్మహత్యకు పాల్పడింది. కాలేజీ హాస్టల్ గదిలో మంగళవారం ఉరి వేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు, పెనుకొండ పట్టణంలోని ఒగ్గప్ప కుంట కాలనీకి చెందిన నాగరాజు కూతురు ధనలక్ష్మి. సీఎస్ఈ తృతీయ సంవత్సరం చదువుతోంది. కాలేజీ ఎన్‌సీసీ శిక్షణలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో పాల్గొంది. సాయంత్రం నాలుగన్నర గంటలకు హాస్టల్ గదికి వెళ్లి.. చున్నితో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. ఆ సమయంలో సహ విద్యార్థినులు స్నాక్స్ కోసం వెళ్లారు. వారు తిరిగి వచ్చి గది తలుపులు తట్టినా ధనలక్ష్మి స్పందించలేదు. దీంతో కాలేజీ సిబ్బందిని పిలిపించి, తలుపులను బద్ధలుకొట్టారు. అప్పటికే ధనలక్ష్మి మృతి చెందింది. సీఐ పుల్లన్న, ఎస్ఐ రాంప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కళాశాల సిబ్బందిని, విద్యార్థులను విచారించారు. గదిలో సూసైడ్ నోట్ ఉందేమోనని పరిశీలించారు. ధనలక్ష్మి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాల్‌డేటాను సేకరించారు. సెల్‌ఫోన్ లాక్ అయిందని, సాంకేతిక నిపుణుల చేత ఓపెన్ చేయించి, వివరాలు సేకరిస్తామని సీఐ తెలిపారు. మృతదేహాన్ని అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. అక్కడికి చేరుకున్న ధనలక్ష్మి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతరం కాలేజీ హాస్టల్ గదికి వెళ్లి పరిశీలించారు. తన కూతురు మృతికి కారణం ఏమిటో తెలియదని, ఈనెల 13 వరకూ ఇంటి వద్ద ఉండి, కాలేజీకి వచ్చిందని విద్యార్థిని తండ్రి నాగరాజు పోలీసులతో అన్నారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి



శివబచ్చన్ మృతదేహం

సోమందేపల్లి, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పత్తికుంటపల్లిలో అతిగా మద్యం తాగి శివబచ్చన్(44) మంగళవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శివబచ్చన్ కొన్నేళ్ల క్రితం మహారాష్ట్ర నుంచి హిందూపురానికి వలస వచ్చాడు. ఎలక్ట్రీషియన్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయలుదేరిన అతడు అతిగా మద్యం తాగి, పత్తికుంటపల్లి వద్ద మృతిచెందాడు. శివబచ్చన్‌కు భార్య రమాదేవి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పెనుకొండకు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

రైతు ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న నక్కా ఓబులేసు

పామిడి, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరపల్లికి చెందిన రైతు నక్కా ఓబులేసు సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నక్కా ఓబులేసు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పంటలు పండక అప్పులపాలయ్యాడు. వాటిని తీర్చేందుకు ఇటీవల రెండెకరాల పొలం అమ్మేశాడు. భూమి కొనుగోలు చేసిన అప్పేచెర్ల చంద్రశేఖర్‌కు నక్కా ఓబులేసుకు బోరుబావి విషయంలో వివాదం తలెత్తింది. దీంతో చంద్రశేఖర్.. ఓబులేసు అన్నదమ్ముల భూమిలోని పైపులను ధ్వంసం చేశాడు. ఈ పరిణామాలతో మనస్తాపం చెందిన ఓబులేసు సోమవారం పొలంలోనే పురుగుల మందు తాగాడు. రాత్రి అయినా అతడు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడిపోయాడు. వెంటనే పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఆత్మహత్యాయత్నంపై పోలీసులను అడగ్గా.. ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రైలుకిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

హిందూపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుడ్డం ప్రాంతంలో రైలు కింద పడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శశికుమార్ తెలిపారు. సుమారు 25 సంవత్సరాల వయసుగల యువకుడు మంగళవారం ఉదయం 11గంటల సమయంలో రైలుకిందపడి దుర్మరణం చెందాడు. లోకోపైలెట్ సమాచారంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వివరాలు తెలిసిన వారు 9441145833ను సంప్రదించాలని సూచించారు.

హమాలీ ఆత్మహత్య



పరమేశ్వర్ రెడ్డి (ఫైల్)

తాడిపత్రి, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఫ్లైఓవర్ సమీపాన మంగళవారం రైలుకింద పడి హమాలీ పరమేశ్వర్ రెడ్డి (46) ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వరప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని శ్రీనివాసపురంలోని ఆంజనేయస్వామి మాన్యం ప్రాంతానికి చెందిన పరమేశ్వర్‌రెడ్డి హమాలీ పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యానికి డబ్బులివ్వాలని ఇంట్లో ఒత్తిడి చేసేవాడు. కొంతకాలంగా పనులు లేకపోవడంతో మానసిక అనారోగ్యం బారిన పడ్డాడు. గట్టిగా అరుస్తూ, కేకలు వేస్తుండేవాడు. ఈ నేపథ్యంలో మనస్తాపం చెంది మంగళవారం ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పరమేశ్వర్ రెడ్డికి భార్య కౌసల్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

అర్హులందరికీ పథకాలు

- ఆధారాలతో వస్తే న్యాయం
- జడ్పీ సమావేశంలో ఎంపీ అంబికా
- ఆర్డీటీ అంశంపై చైర్‌పర్సన్‌తో వాగ్వాదం
- వైద్యం, యూరియా సమస్యలను లేవనెత్తిన సభ్యులు



సమావేశంలో ఎంపీ అంబికా, చైర్ పర్సన్ గిరిజమ్మ, జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. అర్హత ఉండి పథకాలు అందనివారు తగిన ఆధారాలతో వస్తే న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన మంగళవారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరికి 'తల్లికి వందనం' సొమ్ము జమ కాలేదని, విద్యాశాఖ అధికారులు సమాధానం ఇవ్వాలని సభ్యులు డిమాండ్ చేయడంతో ఎంపీ స్పందించారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో అందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. సమావేశానికి ఎమ్మెల్సీ మంగమ్మ, జేసీలు శివనారాయణ శర్మ, అభిషేక్ కుమార్, జడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. చైర్ పర్సన్ గిరిజమ్మ సర్వసభ్య సమావేశాన్ని ప్రారంభించారు. జిల్లాలో విద్య, వైద్య శాఖ ప్రగతిని వివరించాలని అధికారులకు సూచించారు. ఈ లోగా తల్లికి వందనం గురించి సభ్యులు నిలదీశారు. ఉమ్మడి జిల్లాలో ఎంత మంది అర్హులున్నారు, ఎంత మంది తల్లుల ఖాతాలో సొమ్ము జమ అయిందీ చెప్పాలని బుక్కరాయసముద్రం జడ్పీటీసీ భాస్కర్ తదితరులు డిమాండ్ చేశారు.

రైతులను ఆదుకోవాలి: గిరిజమ్మ

ఉమ్మడి జిల్లాలో రైతులను పాలకులు ఆదుకోవాలని చైర్ పర్సన్ గిరిజమ్మ కోరారు. యూరియా సరఫరా, మొక్కజొన్న కొనుగోలుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని సభ్యులు కోరగా, ఆమె స్పందించారు. వ్యవసాయ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపడుతున్నారని ప్రశ్నించారు. మార్కెటింగ్ శాఖ అదే పనిమీద ఉందని జేడీఏ ఉమామహేశ్వరమ్మ అన్నారు. 'పని మీద ఉండటం కాదు.. వెంటనే కొనుగోలు చేసేలా చూడండి' అని గిరిజమ్మ సూచించారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏని పునరుద్ధరించేలా చూడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని గిరిజమ్మ అన్నారు. ఆర్డీటీ సమస్యను పలువురు సభ్యులు సభలో ప్రస్తావించారు. సభలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని జడ్పీటీసీ నాగరాజు పట్టుబట్టారు. ఇప్పటికే ఒకసారి తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించామని, అయినా అమలు కాలేదని చైర్ పర్సన్ అన్నారు. మరోసారి తీర్మానం చేసి పంపుదామని అన్నారు. ఈ అంశంపై ఎంపీ అంబికా, చైర్ పర్సన్ గిరిజమ్మ మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. ఈ సమస్య 2023లోనే తలెత్తిందని, అప్పటికే ఖాతాలు సీజ్ చేశారని అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తరువాత కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాతో చర్చలు జరిపామని ఎంపీ అంబికా అన్నారు. కొత్త ఖాతాలను ప్రారంభించడానికి కొంత సమయం పడుతుందని, ఆ ప్రక్రియ కొనసాగుతోందని అన్నారు. వీలైనంత త్వరగా పూర్తి అవుతుందని, ఆర్డీటీకి పూర్వ వైభవం తెస్తామని అన్నారు.



సమస్యలపై అధికారులను నిలదీస్తున్న జడ్పీటీసీలు

మేమేం ఉన్నోళ్లం కాదు..

'నిధులు లేవు.. విధులు లేవు. పేరుకే ప్రజాప్రతినిధులం. మా మాట చెల్లుబాటు కావడం లేదు. మూడేళ్ల నుంచి గౌరవ వేతనం ఇవ్వడం లేదు. ఇతర రాష్ట్రాలలో రూ.13 వేల గౌరవ వేతనం ఇస్తున్నారు. ఇక్కడ ఇస్తారా..? లేదా..?' అని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. జడ్పీటీసీలు అందరూ ఆర్థికంగా ఉన్నవారేనని అనుకోవద్దని అన్నారు. గౌరవ వేతనం ఇవ్వకుంటే ఎలా బతకాలని ప్రశ్నించారు. కావాలంటే జడ్పీటీసీ, ఎంపీటీసీ వ్యవస్థలను రద్దు చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు.

వైద్యశాలలో ఆకతాయిలు..

ప్రభుత్వ వైద్యశాలలో ఆకతాయిలు వైద్య విద్యార్థులను వేధిస్తున్నారని కొందరు సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వెళితే వైద్య పరీక్షలన్నీ బయటకు రాయిస్తున్నారని అన్నారు. ఆదివారం వస్తే సొంత క్లినిక్‌లకు వెళ్లి పేదలను దోచుకుంటున్నారని అన్నారు. గుమ్మఘట్ట ఎంపీడీఓ ప్రొటోకాల్ పాటించడం లేదని ఎంపీపీ సభ దృష్టికి తెచ్చారు. అనంతపురం రూరల్ మండలంలో అనామకుల చేత ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని జడ్పీటీసీ చంద్రమోహన్ సభ దృష్టికి తెచ్చారు., తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

డీఈఓ లేరని..

తల్లికి వందనం వివరాలను వెల్లడించాలని చైర్ పర్సన్ సూచించారు. కానీ డీఎస్సీ నియామక ప్రక్రియలో బిజీగా ఉన్న డీఈఓ ప్రసాద్ బాబు సభకు హాజరు కాలేదు. తమకు వివరాలు తెలియవని కార్యాలయ సిబ్బంది అన్నారు. దీంతో సభ్యులు కొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను ఒక జడ్పీటీసీ. నాకు ఇద్దరు పిల్లలు. జడ్పీ పాఠశాలలోనే చదువుతున్నారు. అయినా తల్లికి వందనం పడలేదు. కారణం ఏమిటి..? బాధ్యులు ఎవరు..? నేనే జడ్పీటీసీ అయినందుకే సొమ్ము జమకాలేదా..? సభ జరిగిన ప్రతిసారీ ఈ సమస్యను లేవనెత్తుతున్నాం. అధికారులు తప్పించుకు తిరుగుతున్నారు..' అని జడ్పీటీసీ భాస్కర్ అన్నారు. జేసీ శివనారాయణ శర్మ జోక్యం చేసుకుని, వివరాలు చెప్పే ప్రయత్నం చేయడంలో చైర్ పర్సన్ గిరిజమ్మ అడ్డుకున్నారు. 'అన్ని వివరాలను మీరే చెబితే ఇక మిగిలిన అధికారులు ఎందుకు..?' అని ప్రశ్నించారు. డీఈఓ రాలేకపోయారని, సిబ్బందికి అవగాహన లేనందున తానే చెబుతానని జేసీ అన్నారు. నిబంధనల మేరకు ఆదాయ పన్ను చెల్లించేవారికి, ప్రభుత్వ ఉద్యోగులకు తల్లికి వందనం వర్తించదని అన్నారు. అర్హత ఉండి రాకపోతే ఆధారాలను విద్యాశాఖ అధికారులకు ఇవ్వాలని సూచించారు.

టీచర్లపై యాప్‌ల భారం తగ్గించాలి

స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి

మడకశిర టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు అన్నారు. ఆయన మంగళవారం మడకశిర మండలంలో పర్యటించారు. పట్టణంలోని ఎంఆర్‌సీలో జిల్లా సబ్‌కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు, ఇతర బాధ్యతల వల్ల పాఠ్యాంశాల బోధనకు సమయం సరిపోవడం లేదన్నారు. 2023 జూలై నుంచి 12వ వేతన సవరణ అమలు చేయాల్సి ఉండగా నేటికి పీఆర్సీని నియమించకపోవడం దారుణమన్నారు. ఎన్నికలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బేగార్లపల్లి పాఠశాలతో పాటు మండలంలో పలు పాఠశాలలు పర్యటించి సభ్యత్వ నమోదు నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వి.క్రిష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షులు మారుతీప్రసాద్, జిల్లా కోశాధికారి ప్రదీప్‌కుమార్, నాయకులు రమేష్, సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



బేగార్లపల్లి పాఠశాలలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న కాడిశెట్టి శ్రీనివాసులు

దొంగల స్వైర విహారం



పూజమ్మ ఆలయంలో చెల్లాచెదురుగా పడి ఉన్న దుస్తులు

రొద్దం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రాత్రి దొంగలు స్వైరవిహారం చేశారు. రెండు ఆలయాలు, ఇంట్లోకి చొరబడ్డారు. మండలంలోని సుబ్బరాయప్పకొట్టాల గ్రామ సమీపంలో ఉన్న పూజమ్మ దేవాలయం తాళాలు పగలకొట్టి అందులో చొరబడ్డారు. 3 కిలోల వెండి, రూ.30 వేల నగదు చోరీ చేశారు. పెన్నానది ఒడ్డున ఉన్న సాయిబాబా ఆలయంలోకి చొరబడి బీరువాను పగులకొట్టారు. అందులో ఏమీ దొరకలేదు. పక్కనే ఉన్న కుర్లపల్లి అంజినరెడ్డి ఇంటి తాళాలు పగులకొట్టి లోపలికి ప్రవేశించి, బీరువాను ధ్వంసం చేశారు. ఏమీలేకపోవడంతో వెనుదిరిగారు. అటునుంచి పెన్నానది గట్టున మొక్కజొన్న యంత్రంలో ఉన్న టూల్ కిట్స్ జాకీని ఎత్తుకెళ్లారు. ఉదయం సమాచారం అందుకున్న ఎస్ఐ నరేంద్ర ఆలయంలో క్లూస్ టీమ్‌తో తనిఖీ చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్రీడా పోటీలు వాయిదా

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం నుంచి నిర్వహించాల్సిన క్రీడాపోటీలు అనివార్య కారణాలతో వాయిదావేసినట్లు స్కూల్ గేమ్స్ సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. 17న వెయిట్ లిఫ్టింగ్, సాఫ్ట్ టెన్నిస్, స్కేటింగ్, 18న జూడో, కురాష్, టేబుల్ టెన్నిస్, 19న రెజ్లింగ్, తైక్వాండో పోటీలు జరగాల్సి ఉందన్నారు. మెగా డీఎస్సీ అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేసే కార్యక్రమం రాజధాని అమరావతిలో నిర్వహించనున్న నేపథ్యంలో పోటీలు వాయిదా వేశామన్నారు. తదుపరి తేదీలు, వివరాలకు 7989737474 నంబరులో సంప్రదించాలని కోరారు.

నేడు అర్చకుల సమావేశం

అనంతపురం టౌన్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో బుధవారం అర్చకుల సమావేశం నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అసిస్టెంట్ కమిషనర్లు హాజరవుతారన్నారు. అర్చకుల సమస్యలపై చర్చిస్తారని ఆయన తెలిపారు.

వివక్షను ఎదుర్కొని.. ఆదర్శంగా ఎదిగారు

పూలే దంపతుల అడుగుజాడల్లో నడుద్దాం: ఎంపీ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పూలే దంపతులు వివక్షను ఎదుర్కొని, ఆదర్శంగా ఎదిగారని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. వారి అడుగుజాడల్లో నడుద్దామని పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ ఆవరణలోని జ్యోతిరావ్ పూలే విగ్రహం వద్ద సావిత్రీబాయి పూలే విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఎంపీ అంబికా మాట్లాడుతూ.. సావిత్రీబాయి పూలే టీచర్‌గా ఎన్నో అడ్డంకులను అధిగమించి, సమాజం కోసం పోరాటం చేశారని గుర్తుచేశారు. ఆమెకు జ్యోతీబాయి పూలే పూర్తి సహకారం అందించారన్నారు. బీసీలకు 43 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నదానిపై చర్చ జరుగుతోంది. అది అమలైతే బీసీలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల వారికి సమాన అవకాశాలు కల్పించాలని పూలే దంపతులు పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జాయింట్ కలెక్టర్లు శివనారాయణశర్మ, అభిషేక్ కుమార్, జడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.



సావిత్రీబాయి పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ, జడ్పీ చైర్‌పర్సన్

స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ రగ్బీ, ఉషూ జట్లను మంగళవారం ఎంపిక చేశారు. జట్టు వివరాలను స్కూల్ గేమ్స్ సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు వెల్లడించారు. రగ్బీ బాలికల అండర్-14 జట్టుకు లలితప్రియ, వర్ష, చైతన్య, మానస, యశస్విని, అనిత, సురేఖ, చిత్ర, జ్ఞానదీపిక, స్వప్న, నవ్య, హిమబిందు, వర్షిత, శశికళ ఎంపికయ్యారు. బాలురలో పవన్, అభి, శ్రీసూర్య, సుషాంత్, వాసుదేవ్, అరుణ్‌కుమార్, లలిత్‌కిషోర్, ధనుంజయ, తేజసింహ, రామ్‌చరణ్, యశ్వంత్, మహేశ్వర్‌నాయుడు, దినేష్, మనోజ్ రెడ్డి, రంజిత్, వరుణ్ సందేశ్, భరత్‌కుమార్ ఎంపికయ్యారు. ఉషూ అండర్-17 బాలుర జట్టుకు నరేష్, రవితేజ, మణికంఠ, అరుణ్, వంశీకృష్ణ, ఉదయ్‌కుమార్, యశ్వంత్, శివతేజ, ధనుష్, ప్రశాంత్, అండర్-19కు నందకిశోర్, నరసింహ, కార్తీక్, లోకనాథ్, సురేంద్ర, రఘునాథ్, హర్ష, మధుకిరణ్, జగన్మోహన్ రెడ్డి, కుమార్ ఎంపికయ్యారు. అండర్-14, 17, 19 విభాగాల్లో కరాటే, ఆర్చరీ జట్లకు 36 మందిని ఎంపిక చేశారు.

ఆయా జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని కార్యదర్శి తెలిపారు. కార్యక్రమంలో ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణ, ఎస్‌జీఎఫ్ సభ్యులు పీడీలు శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, నరసింహారెడ్డి, పీఈటీలు నిరంజన్ రెడ్డి, ఓబులేసు, సమీరా, రేఖ, లీలారాణి, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన రగ్బీ జట్టు

అదృశ్యమైన రెండేళ్లకు ఛేదింపు



రాజేశ్వరి, ఆమె పిల్లలను చూపుతున్న ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యమైన కేసును రెండేళ్ల తరువాత ధర్మవరం రూరల్ పోలీసులు ఛేదించారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పోతుకుంట బృందావనం కాలనీకి చెందిన వడ్డే రాజేశ్వరి, వడ్డే శివ దంపతులకు కుమారుడు నిఖిల్, కుమార్తె చైతన్యశ్రీ ఉన్నారు. కొన్ని కారణాలతో వడ్డే రాజేశ్వరి.. కుమారుడు, కుమార్తెను తీసుకుని రెండేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ విషయంపై 2023లో శివ.. రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పట్లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. తల్లి, ఇద్దరు పిల్లలు బెంగళూరులో ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి వెళ్లి వారిని పిలుచుకొచ్చారు. తహసీల్దార్ సురేష్‌బాబు ఎదుట హాజరుపరిచి, గ్రామానికి పంపించారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దారుణం

సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ



వైద్య కళాశాల వద్ద మాట్లాడుతున్న రామకృష్ణ తదితరులు

పెనుకొండ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పది ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం దుర్మార్గమైన ఆలోచన అని సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. పెనుకొండ సమీపంలో నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాల భవనాలను ఆయన జిల్లా కమిటీ సభ్యులు హరి, ప్రవీణ్, జంగాలపల్లి పెద్దన్న, వివిధ ప్రజాసంఘాల నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలలను ప్రభుత్వమే తక్షణం పూర్తి చేయాలన్నారు. అలా కాకుండా పీపీపీ విధానం ద్వారా వైద్య కళాశాల నిర్మాణం చేపడితే పేద, మధ్యతరగతి విద్యార్థులు నష్టపోతారన్నారు. ఈ కళాశాలలను ప్రభుత్వమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను, యువతను అందరినీ కలుపుకుని ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు బాబావలి, గంగాధర్, మహబూబ్‌బాషా, నాగరాజు, హనుమంతు, సుధాకర్, హబీబ్‌వలి, రైతు సంఘం నాయకులు ఫక్రుద్దీన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

యూరియా అధికంగా వాడకండి: ఏడీఏ

బత్తలపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటలకు అధిక మోతాదులో యూరియ వాడడం వలన, పంటలు దిగుబడి సామర్థ్యం కోల్పోతాయని ఏడీ లక్ష్మనాయక్ తెలిపారు. మండలపరిధిలోని దంపెట్ల గ్రామంలో మంగళవారం పోలం పిలుస్తోంది కార్యక్రమాన్ని న్విహించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన కంది పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ... కంది పంట పూత దశలో ఉన్నందున లీటరు నీటికి 3ఎంఎల్ వేపనూనె, లీటరు నీటికి 2.5 ఎంఎల్ క్లోరోఫైరిపాస్ కలిపి పిచికారి చేయాలన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఓబిరెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు

నానో యూరియా వాడండి: ఏఓ

● నల్లమాడ: మండలంలోని ఎన్ బండవాండ్లపల్లిలో మంగళవారం ఏఓ అబ్దుల్‌హక్ ఆధ్వర్యంలో పొలంబడి నిర్వహించారు. ఆయన వరి పంటను పరిశీలించి మాట్లాడుతూ... నానో యూరియాను ప్రతి రైతు వినియోగిస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. భూసారం పెరుగుతుందన్నారు. 500 ఎంఎల్ నానో యూరియాను వంద లీటర్ల నీటిలో కలిపి వరిపంట 25రోజులు, 45రోజుల సమయంలో ఎకరాకు పిచికారి చేయాలన్నారు. గ్రోమోర్ మేనేజర్ నరేంద్ర,ఎంపీఇఓ అస్లాం బాషా, రైతులు పాల్గొన్నారు.

● నంబులపూలకుంట: రైతులు సాగుచేసిన పంటలకు ఈ నెల 30లోగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని ఏఓ లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆయన మంగళ వారం మండలంలోని వెలి చెలమల, తాటిమానుగుంత గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కంది పంటను పరిశీలించి యజ మాన్య పద్ధతులను రైతులకు వివరించారు. మండల వ్యాప్తంగా అన్ని రైతుసేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. గురువారం మేకలచెరువు, మరికొమ్మెదిన్నె రైతు సేవాకేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంటుందన్నారు. రైతు సేవాకేంద్రం సిబ్బంది నారాయణస్వామి, రైతులు పాల్గొన్నారు.

సొసైటీని తనిఖీ చేసిన ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్



గూనిపల్లి సొసైటీని తనిఖీ చేస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి

బుక్కపట్నం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూనిపల్లి ప్రాథమిక సహకార సంఘం కార్యాలయాన్ని జిల్లా ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక సహకార సంఘాల ద్వారా రైతులకు సబ్సిడీ రుణాలు అందిస్తూ, అన్నివిధాల ఆదుకుంటున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయనతో పాటు సహకార సంఘం అధ్యక్షుడు జూటూరు ప్రభాకర్‌రెడ్డి, సీఈఓ ఆంజనేయులు, నాయకులు జూటూరు రవీంద్రారెడ్డి, ప్రజలు, రైతులు పాల్గొన్నారు.


'లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించాలి'

ధర్మవరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): యువత ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాదించేంత వరకు విశ్రమించకూడదని ఉపాధ్యాయ సంఘాల గౌరవ సలహాదారుడు, సంస్కృతి సేవాసమితి రాష్ట్ర కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. సంస్కృతి సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం గురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్(నంద్యాల) సహకారంతో 120 మంది విద్యార్థులకు బ్యాంకింగ్ ఉచిత శిక్షణ అర్హత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంటేరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసి వారికి త్వరలో మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా ప్రవేశపత్రాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కూలిన పాత మిద్దె

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకుతోటపల్లిలో పోతుక జయపద్మ అనే మహిళ నివాసముంటున్న పాత మిద్దె మంగళవారం సాయంత్రం కూలింది. మిద్దె కూలిన సమయంలో ఆమె పనిమీద బయటకెళ్లింది. ఆమె కుమార్తె శ్రుతి ఇంట్లోనే ఉంది. మిద్దె కూలుతున్న శబ్దం పసికట్టిన శ్రుతి వెంటనే బయటకు పరుగులు తీసింది. వెంటనే మిద్దె కూలిపోయింది. తనకుమార్తె ఏ మాత్రం ఆలస్యం చేసినా పెద్ద ప్రమాదం జరిగేదని ఆమె బాధ వ్యక్తం చేసింది. ప్రభుత్వం స్పందించి తమకు పక్కాగృహం మంజూరు చేయాలని కోరారు.

జేవీవీ రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ ఆదిశేషు



ధర్మవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన డాక్టర్ ఆదిశేషును జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికచేసినట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి లోకేశ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 13,14తేదీల్లో విజయనగరంలో జరిగిన జేవీవీ రాష్ట్ర మహాసభలో డాక్టర్ ఆదిశేషును ఎంపిక చేసినట్లు తెలిపారు. తన ఎంపికకు సహకరించిన జేవీవీ రాష్ట్ర, జిల్లా నాయకులకు ఆదిశేషు కృతజ్ఞతలు తెలిపారు.

ఆక్యుపంక్చర్ థెరపిస్టుకు అవార్డు

కదిరి అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని న్యూరో ఆక్యుపంక్చర్ థెరపిస్టుగా సేవలందిస్తున్న డాక్టర్ పాముదుర్తి రజీవుల్లాఖాన్‌కు మదర్‌థెరిసా సొసైటీ జాతీయ అవార్డు దక్కింది. విజయవాడలోని ఆ సొసైటీ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందించినవారికి అవార్డు ప్రదానం చేశారు. మంగళవారం విజయవాడలో జరిగిన సొసైటీ మూడో వార్షికోత్సవం సందర్భంగా సొసైటీ వ్యవస్థాపకులు ఆక్టర్ మల్లాది ప్రసాద్‌రావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు డాక్టర్ రజీవుల్లాఖాన్ తెలిపారు.

పాము కాటుతో ఆవు మృతి

నల్లచెరువు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొగ్గన్నపేటలో పాముకాటుకు గురై మంగళవారం ఆవు మృతిచెందింది. గ్రామానికి చెందిన పాడి రైతు ఈడిగ ప్రభాకర్ మధ్యాహ్నం గ్రామ సమీపంలోని పొలాల్లో ఆవును మేపుతుండగా, పాముకాటుకు గురై మృతిచెందింది. ఆవు దాదాపు రూ. లక్ష పెట్టి కొనుగోలు చేశామని, రోజుకు 20లీటర్లు పాలిచ్చేదని రైతు కంటతడిపెట్టారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

అప్పు చెల్లించమంటే బెదిరిస్తున్నాడు

● ఓ వ్యక్తి ఫిర్యాదు.. కేసు నమోదు

కదిరిఅర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన డబ్బును తిరిగి ఇవ్వమంటే బెదిరిస్తున్నట్లు పట్టణంలోని ఎన్జీవో కాలనీలో నివాసముంటున్న శ్రీరాములు ఫిర్యాదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని అడపాల వీధికి చెందిన సంజీవరాయుడు కొన్నిరోజుల క్రితం శ్రీరాములు తన వద్ద ఉన్న రూ.15 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ డబ్బును తిరిగి ఇమ్మని అడుగుతుంటే బెదిరిస్తున్నట్లు శ్రీరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంజీవరాయుడుపై ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

నిర్మించారు... వదిలేశారు

నిరుపయోగంగా నీటి తొట్టెలు



పూలకుంటపల్లిలో నీరులేక నిరుపయోగంగా ఉన్న పశువుల తొట్టె

అమడగూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా పశువుల దాహార్తి తీర్చడానికి జాతీయ ఉపాధి హామీ పథకం కింద 45 నీటి తొట్టెలు నిర్మించారు. వాటికి పైప్‌లైన్ ఏర్పాటు చేసి, నీటిని సరఫరా చేయడం లేదు. ఈ యేడాది వర్షాలు తక్కువగా నమోదు కావడంతో మండలంలో నీటి నిల్వలు లేవు. పలు గ్రామాల్లో తొట్టెలకు నీటిని సరఫరా చేయక పోవడంతో పశువుల దాహార్తి తీర్చేందుకు వాటి యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక తొట్టె నిర్మించడానికి దాదాపు రూ.40 వేలు చొప్పున 45 నీటి తొట్టెలకు రూ.15,48 వేలు పైచిలుకు వెచ్చించారు. మండలంలోని పూలకుంట్లపల్లి, తనకంటి వారిపల్లి, కొట్టువారిపల్లిల్లో నీటి తొట్టెలకు పైప్‌లైన్ అమర్చలేదు. నిర్మించి నాలుగు నెలలు అవుతున్నా ఖాళీ తొట్టెలు దర్శనమిస్తున్నాయి. ఇదిలా ఉండగా నీటి తొట్టెలను పూర్తిస్థాయిలో నిర్మించినా బిల్లులు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. మండల వ్యాప్తంగా 40శాతం తొట్టెలు పూర్తి అయ్యాయి. అయితే తొట్టెల నిర్మాణంలో నాణ్యత కొరబడిందనే విమర్శలు ఉన్నాయి. ముందుగా కంకరతో బెడ్డింగ్ వేసి దానిపై తొట్టెలు నిర్మించాల్సి ఉంది. అలా చేయకపోవడంతో నీరు లీకేజీ అయి త్వరగా తొట్టెలు దెబ్బతినే అవకాశముందని ప్రజలు అంటున్నారు.

నీరు లేక ఇబ్బంది పడుతున్నాం



పశువుల దాహార్తి తీర్చడానికి నాలుగు నెలల క్రితం తొట్టె నిర్మించారు. ఇప్పటి వరకు నీరు సరఫరా చేయలేదు. దీంతో నాకున్న రెండు పాడి ఆవులను దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ దూరంలో ఉన్న చెరువు వద్దకు తోలుకెళ్లి దాహార్తి తీర్చాల్సి వస్తోంది. గ్రామానికి అనుకుని నిర్మించిన తొట్టెకు నీరు సరఫనా చేస్తే మాకు ఇబ్బంది ఉండదు.

-విశ్వనాథ్, తనకంటివారిపల్లి

నీటి కొరత వల్ల పైప్‌లైన్ వేయలేదు

పశువుల దాహార్తి తీర్చడానికి నీటి తొట్టె నిర్మించాం. దానికి నీరు సరఫరా చేయడానికి మాకు ఇబ్బంది లేదు. గ్రామంలో ఉన్న బోరులో నీటి కొరత ఉంది. దీంతో తొట్టెకు కొళాయిలు ఏర్పాటు చేసేందుకు అవకాశం లేదని పలువురు గ్రామస్థులు అభ్యంతరం చెబుతున్నారు. తొట్టెకు కొళాయిలు ఏర్పాటు చేస్తే గ్రామంలోకి నీరు చేరదని, కొళాయిలు వేయలేదు.

-నారాయణస్వామి, కాంట్రాక్టర్

నిధులు వచ్చిన వెంటనే బిల్లులు

తొట్టెలు నిర్మించిన కాంట్రాక్టర్లకు ఇప్పటివరకు ఎలాంటి బిల్లులు చెల్లించలేదు.పూర్తిగా పరిశీలించి, నివేదికలు పంపాం. నిధులు వచ్చిన వెంటనే బిల్లులు చెల్లిస్తాం. -మధుసూదన్, ఏపీఓ, ఉపాధి హామీ పథకం, అమడగూరు

విద్యార్థుల సౌకర్యాల కల్పనకు కృషి

● విద్యాభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే కందికుంట



గాండ్లపెంట సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

గాండ్లపెంట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ, విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా పీఎంసీ నిధులతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.23లక్షలకుపైగా కెమిస్ట్రీ ల్యాబ్, కిచెన్ గార్డెన్, రైన్‌వాటర్‌హార్వెస్టింగ్ తదితర పనులను పాఠశాల కమిటీ చైర్మన్ రెడ్డినాయక్, ఎంపీపీ సోముశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం విద్యార్థుల చదువులకోసం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. విద్యా శాఖ మంత్రి నారాలోకేష్ నూతన ఆలోచనలతో ముందుకు వెళ్తున్నారన్నారు. ప్రతిభా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబురావు, ఎంఈఓలు క్రిష్ణానాయక్, శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు సురేష్, ఉపాధ్యాయులు, టీడీపీ మండల కన్వీనర్ కొండయ్య, సర్పంచ్‌లు రహంతుల్లా, అక్రమబాషా, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఫీడింగ్ రూమ్ ప్రారంభం

● కదిరిఅర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ఫీడింగ్ రూమ్‌ను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీషా మంగళవారం ప్రారంభించారు. బహిరంగప్రదేశాల్లో చిన్నారులకు పాలు తాగించడానికి తల్లులు ఇబ్బందులు పడకుండా ఫీడింగ్ రూమ్ సురక్షితమన్నారు. ఈ గది ఏర్పాటుకు సహకరించిన రోటరీ క్లబ్ కదిరి శాఖ వారికి అభినందనలు తెలిపారు. పట్టణంలోని 16 వార్డులో సీసీరోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. రూ.17 లక్షల వ్యయంతో సీసీరోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీషా, నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, డైమండ్ ఇర్ఫాన్, బాహద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు



ధర్మవరంలోని ఎన్డీఏ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న హరీశ్‌బాబు

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీ శ్‌బాబు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, మహిళ నేతలతో కలిసి కేక్ కట్‌చేసి, శుభాకాంక్షలు తెలిపారు. టపాసులు కాల్చి సంబరాలు చేసు కున్నారు. అనంతరం కార్యాలయం వద్ద భారీఎత్తున అన్నదానం చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌బాబు మాట్లాడుతూ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు తీసుకొచ్చారని అన్నారు. ప్రజలతో అనుబంధాన్ని పెంచుకుంటూ, ఎల్లప్పుడూ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. బీజేపీ నాయకులు అంగజాల రాజు, నారా కొండయ్యచౌదరి, గొట్లూరు సర్పంచ్ పిట్టా నరసమ్మ, నర సింహులు, చిగిచెర్ల నరసింహమూర్తి, నందనాయక్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని గొట్లూరులో ప్రధాని, మంత్రి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు అనిల్‌గౌడ్, కట్టుబడి వెంకటేష్ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి ఆలయంలో వారి పేరుమీద అర్చనలు చేయించారు. పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

●ముదిగుబ్బ: మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, బీజేపీ మండల కన్వీనర్ అంజన్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో కేక్ కట్‌చేశారు. జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో కేక్ కట్‌చేసి, 450 మంది విద్యార్థినులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, బీజేపీ నాయకులు మాలపాటి రామకృష్ణ, కమతం గంగాధర్ రెడ్డి, గడ్డం ఓబిరెడ్డి, ఫణీంద్ర గౌడ్, కంటే రామ్మోహన్, సోమల ప్రకాష్, పసుపులేటి వెంకటేష్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



గొట్లూరు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు



ముదిగుబ్బలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం →

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

● ఏపీటీఎఫ్ నాయకులు
● కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

కొత్తచెరువు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరి ష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం పుట్టపర్తిలోని కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి ఆశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తిఅయినా ఇప్పటివరకు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించలేదన్నారు. ప్రభుత్వం వెంటనే పెండిగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి, పీఆర్సీ కమిషన్‌ను నియమించాలన్నారు. పీఆర్సీ అందేంతవరకు 30 శాతం ఐఆర్ మంజూరు చేయాలని, ఈహెచ్ఎస్ పరిమితి రూ.25 లక్షలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే విడుదలచేయాలన్నారు. పాఠశాలల్లో నూతనంగా ప్రవేశ పెట్టిన అసెస్‌మెంట్ బుక్ విధానాన్ని పునఃసమీక్షించాల న్నారు. యాప్‌ల భారాన్ని తగ్గించాలని, ఉపాధ్యాయులను విద్యా బోధనకు మాత్రమే పరిమితం చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయ్లఓ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్.చంద్ర, రాష్ట్ర నాయకులు ముత్యాలప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్ర రెడ్డి, బలరాముడు, జిల్లా కార్యదర్శి ఆది బయన్న నాయకులు రాజశేఖర్, హరిప్రసాద్, వెంకట నాయుడు, వెంకటరమణ, ఈశ్వరయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

● వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దన్న

కొత్తచెరువు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్ఏలు ఈ నెల 18,19 తేదీల్లో తహసీల్దార్ కార్యలయాల వద్ద ధర్నా నిర్వహించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దన్న మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. వీఆర్ఏల పలు సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదన్నారు. దీంతో ఈ నెల 18,19 తేదీల్లో తహసీల్దార్ కార్యలయాల వద్ద, 20న ఆర్డీఓ కార్యలయాల వద్ద, 22న కలెక్టరేట్‌ల వద్ద ధర్నా నిర్వహించి, వినతి పత్రాలను అందజేయాలని ఆయన కోరారు.

సేవా పక్షోత్సవాలను...

● నంబులపూలకుంట: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా బుధవారం నుంచి అక్టోబరు 2 వరకు జరగనున్న సేవా పక్షోత్సవాలను విజయ వంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామమోహన్ తెలిపారు. సంబంధిత పోస్టర్లను ఆయన మంగళవారం మండలకేంద్రంలోని తన నివాసంలో విడుదల చేశారు. బీజేపీ నాయకులు రామమోహన్, బాబ్‌జాన్, చాంద్‌బాషా, భార్గవ్, రవీంద్ర, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి స్మారక క్రికెట్ టోర్నీ

విజేత డ్రాగన్ లెవెన్స్



విజేతకు చెక్కు, ట్రోఫీ అందజేస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్, హరీశ్‌బాబు

ధర్మవరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏ క్రీడలలోనైనా గెలుపోటములను సమానంగా తీసుకోవాలని డీఎస్పీ హేమంత్‌కుమార్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో మంగళవారం అటల్ బిహారీ వాజ్ పేయిస్మారక క్రికెట్ టోర్నీ సీజన్-2 ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. డ్రాగన్ లెవెన్స్ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో డ్రాగన్ లెవెన్స్, హిందూపురం హంటర్స్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన డ్రాగన్ లెవెన్స్ జట్టు 158 పరుగులు చేసింది. తరువాత బరిలోకి దిగిన హిందూపురం హంటర్స్ జట్టు 108 పరుగులు చేసి ఆలౌట్ అయింది. దీంతో 50 పరుగుల తేడాతో డ్రాగన్ లెవెన్స్ జట్టు విజేతగా నిలిచింది. విన్నర్ జట్టుకు రూ. లక్ష చెక్కు, ట్రోఫీని, రన్నర్ జట్టుకు రూ.50వేల చెక్కును డీఎస్పీ హేమంత్ కుమార్, హరీశ్‌బాబు అందజేశారు. అదేవిధంగా ఈ మ్యాచ్‌లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ అంబటిఅరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొరను కాపాడుకుందాం: ప్రిన్సిపాల్



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఓజోన్ పొరను కాపాడుకుందామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత పేర్కొన్నారు. ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాలలో అవగాహన కల్పించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... మానవాళి మనుగడకు అత్యవసరమైన ఓజోన్ పొరను కాపాడుకో వాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నా రు. అనంతరం కళాశాల నుంచి పట్టణంలోని కాలేజీ సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సుబ్బారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చెన్నారెడ్డి, క్రిష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ ఎంఈఓలను నియమించాలి

● ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

కదిరి అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పాఠశాలల పర్యవేక్షణకు అర్బన్ ఎంఈఓ పోస్టులను కేటాయించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి డిమాండ్‌చేశారు. మంగళవారం పట్టణంలోని నిజాంవలీకాలనీ, మశానంపేట, రాణీపేట తదితర పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని మున్సి పాలిటీల్లో చాలా పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేశారన్నారు. దీంతో ఉపాధ్యాయుల సంఖ్య పెరగడంతో పర్యవేక్షణకు ప్రత్యేకంగా అర్బన్ ఎంఈఓ పోస్టులు కేటాయించాలన్నారు. ఎస్టీయూ నాయకులు శంకర్‌నాయక్, వీరమహేశ్వర, నాగరాజు, రమణారెడ్డి, రామ క్రిష్ణారెడ్డి, సుధాకర్, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

40 ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం

● పరిటాల శ్రీరామ్ చొరవతో ఇనుప స్తంభం తొలగింపు



కొత్త స్తంభాన్ని ఏర్పాటుచేస్తున్న దృశ్యం

ధర్మవరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీఆర్‌టీ వీధిలో 40 ఏళ్లగా ఉన్న విద్యుత్ ఇనుప స్తంభాన్ని తొలగించి నూతన స్తంభం ఏర్పాటు చేశారు. పీఆర్‌టీ వీధిలో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న ఇనుప విద్యుత్‌స్తంభం ప్రమాదకరంగా ఉండేది. వర్షాకాలంలో దానికి విద్యుత్ సరఫరా అవుతుండడంతో పలువురికి విద్యుదాఘాతమైంది. ఆ స్తంభాన్ని మార్చాలని స్థానికులు కొన్నేళ్ల నుంచి కోరుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో గత నెలలో జరిగిన 'మీ సమస్య- మా బాధ్యత' కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ దృష్టికి స్థానికులు తెచ్చారు. ఆయన సూచనతో విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం ఇనుప స్తంభాన్ని తొలగించి మరో స్తంభం ఏర్పాటుచేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, సాగునీటిసంఘం అధ్యక్షుడు రేనాటి శ్రీనివాసులు, నాయకులు చింతపులును పెద్దన్న, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేటు వ్యక్తుల దందా అరికట్టాలి

● సీపీఐ నాయకుల డిమాండ్

కదిరి అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల దందాను అరికట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ప్రైవేటు వ్యక్తుల ఆగడాలు రోజు రోజుకు మితిమీరి పోతున్నా, పట్టించుకునే నాథుడే లేడన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పవన్, లియాకత్, మధునాయక్, రమణ, మహేంద్ర, శోభ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

● పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా

తనకల్లు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం చేయాలంటూ మండలంలోని ఈతోడు గ్రామానికి చెందిన వెంకటరమణ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఓ విషయంలో రెండునెలల క్రితం గ్రా మానికి చెందిన పవన్‌కుమార్ కుటుంబం, తమ కుటుంబాల మధ్య వివాదం చోటు చేసుకుందన్నారు. ఈ విషయంలో పవన్ కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేయడంతో, అతడు బెంగళూరుకు వెళ్లిపోయాడన్నారు. రెండు రోజులక్రితం తిరిగి వచ్చిన అతడు తమను చంపుతామంటూ బెదిరిస్తున్నట్లు ఆరోపించారు. ఈ విషయంపై న్యాయం చేయాలని తిరుగుతున్నా పోలీసులు పట్టించుకోలేదని ఆవేదన చెందారు. ఈ విషయాన్ని ఎస్ఐ గోపి దృష్టికి తీసుకెళ్లగా అప్పడు ఓ మహిళ వివాదంలో నమోదు చేసిన కేసు పెండింగ్‌లో ఉందన్నారు. వెంకటరమణ కుటుంబం ఫిర్యాదు చేస్తే న్యాయం చేస్తామన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు కొత్తచెరువు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

కొత్తచెరువు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివసాయి జూనియర్, డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ, ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని కళాశాల కరస్పాండెంట్ జి.వేణుగోపాల్ మంగళవారం తెలిపారు. డిగ్రీ ఫస్టియర్ చదువుతున్న ఫారుక్ ఈ నెల 13న కదిరిలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపారని తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ చదువు తున్న పి. సాయిచరణ్ ఈనెల 15న అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపారన్నారు. ఆ విద్యార్థులను ప్రిన్సిపాళ్లు రాకేష్, జాకీర్‌తో పాటు అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు.

ఫుట్‌బాల్ పోటీలకు ధర్మవరం విద్యార్థిని



ఎంపికైన విద్యార్థినితో హెచ్‌ఎం, పీడీ

ధర్మవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సాజియా రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం శారద తెలిపారు. అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో సోమవారం ఉమ్మడి జిల్లా నుంచి ఫుట్‌బాల్ అండర్-14 విభాగంలో సాజియా ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలలో ఈ విద్యార్థిని పాల్గొంటుందన్నారు. దీంతో మంగళవారం విద్యార్థిని సాజియాను పాఠశాల హెచ్‌ఎంతోపాటు, పీడీ రాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

న్యూస్ బాక్స్

యానిమేటర్‌పై ఫిర్యాదు



పీడీ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న డ్వాక్రా మహిళలు

గోరంట్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరమణపల్లికి చెందిన వివిధ డ్వాక్రా సంఘాల మహిళలు యానిమేటర్ సరస్వతిపై పుట్టపర్తి వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఫిర్యాదు చేశారు. కొత్తగా వచ్చిన యానిమేటర్ సరస్వతి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సభ్యులను ఇబ్బంది పెడుతున్నట్లు వాపోయారు. ప్రతి పనికి సంఘం సభ్యులు యానిమేటర్ ఇంటికి రావాలంటూ రికార్డులు, బ్యాంక్ పుస్తకాలు తనవద్దే ఉంచుకుని, తాను చెప్పినట్లు వినాలని హుకుం జారీ చేస్తున్నట్లు ఆరోపించారు. మాట విననివారిపట్ల కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న ఈ యానిమేటర్‌ను విధుల నుంచి తొలగించాలని అధికారులకు విన్నవించుకున్నారు. 30 సంఘాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పుట్టపర్తి పీడీ కార్యాలయానికి వెళ్లి, గోడు వినిపించారు.

ఎస్సీ కాలనీకి విద్యుత్ సౌకర్యం



విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

చిలమత్తూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే బాలకృష్ణ ముందుంటారని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో కొన్ని వీధులకు చాలా కాలంగా విద్యుత్ సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడేవారు. ఈ సమస్యను ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాలతో మంగళవారం విద్యుత్ సౌకర్యం కల్పించారు. విద్యుత్ శాఖ ఏఈ జయవర్ధన్ ఆధ్వర్యంలో సిబ్బంది విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు కృషి చేసినట్లు శ్రీనివాసులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురం సమీపంలో ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. రాంపురం సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించామన్నారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.30వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డును బాగు చేయండి



గుంతలమయమైన రోడ్డును చూపుతున్న యువకుడు

అమరాపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఎదురుగా గుంతలమయమైన ప్రధాన రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. వైఎస్సార్ సర్కిల్ నుంచి బస్టాండుకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా పాడైపోయింది. ఈ రోడ్డుపై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇదే రహదారిపై ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్తున్నా చూసీచూడనట్లు ఉన్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వస్తే మోకాళ్లలోతులో నీళ్లు నిలబడి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎంపీడీఓ తీరుపై ధర్నా

లేపాక్షి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ నరసింహమూర్తి తీరును నిరసిస్తూ వైస్ ఎంపీపీ అంజినరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 12న జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ మండలపరిషత్ నిధులను ప్రజాప్రతినిధులకు కాకుండా పార్టీలకు కేటాయించడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంటనే ఎంపీడీఓ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో నిర్మాణాల తొలగింపు



అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్న దృశ్యం

గోరంట్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ప్రభుత్వ స్థలంలో ఉన్న అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు మంగళవారం తొలగించారు. సర్వేనెంబర్ 272-4, 5 లెటర్లలోని ప్రభుత్వ స్థలంలో లేఅవుట్ వేసి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వైసీపీ ప్రభుత్వంలో అక్రమ పట్టాలతో ప్రభుత్వ స్థలాన్ని అక్రమించు కున్నారు. ఈ సమస్య ప్రస్తుతం కోర్టులో ఉంది. కాగా ఆ స్థలంలో ఎవరూ ప్రవేశించకుండా అధికారులు హెచ్చరిక బోర్డులు వేసినా, కొంతమంది నిర్మాణాలు చేపట్టారు. గోరంట్లకు చెందిన మహమ్మద్ భార్య షాహీనా పేరుతో రెండు సెంట్ల స్థలంలో పునాదులు వేసి, గోడల నిర్మాణం చేపట్టారు. దీంతో తహసీల్దార్ మారుతి ఆదేశాల మేరకు వీఆర్‌ఓలు అశోక్, అనిల్, లక్ష్మినారాయణ, ప్రవీణ్, వీఆర్ఏ వినోద్ తదితర రెవెన్యూ సిబ్బంది ఎక్స్‌కవేటర్‌తో అక్రమ నిర్మాణాలు తొలగించారు. ప్రభుత్వ స్థలం ఆక్రమిస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

వేగంగా హంద్రీనీవా పనులు

● ముమ్మరంగా కంపచెట్ల తొలగింపు, పూడికతీత ● రూ.88 లక్షలతో మరమ్మతులు



సీ కొడిగేపల్లి వద్ద కాలువ మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

మడకశిర రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో హంద్రీనీవా కాలువ మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే కాలువకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించే ప్రక్రియ ప్రారంభం అయ్యింది. పూడిక తీత పనులు కూడా చేపట్టారు. మడకశిర మండలం సీ కొడిగేపల్లి, కేతేపల్లి నుంచి హంద్రీనీవా కాలువ మరమ్మతు పనులు చేపట్టారు. మడకశిర, అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి మండలాలోని అన్ని చెరువులకు నీరు నింపాలన్న లక్ష్యంతో పనులు చేస్తున్నారు. మొత్తం 87 కిలోమీటర్ల మరమ్మతు పనులకు ప్రభుత్వం రూ.88 లక్షలు కేటాయించినట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు.



కంపచెట్లు, పూడిక తొలగించిన కాలువ

సంతోషకరం..



వైసీపీ పాలనలో చెరువులకు చుక్కనీరు రాలేదు. చెరువులు, కాలువలు ఏమాత్రం అభివృద్ధి చేయలేదు. రైతుల అభివృద్ధి గురించి మరిచిపోయారు. ఎమ్మెల్యే రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండమల తిప్పేస్వామి చెరువులకు నీరు అందించేందుకు బాగా కృషి చేస్తున్నారు. త్వరలో చెరువులకు నీరు వస్తాయన్నా నమ్మకం కలుగుతోంది. ఇది రైతులకు ఎంతో సంతోషకరమైన విషయం.

- రంగారెడ్డి రైతు, సీ కొడిగేపల్లి

రెండు వారాల్లో పనులు పూర్తి

నియోజకవర్గంలోని మడకశిర, అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి మండలాల్లోని అన్ని చెరువులకు హంద్రీనీవా ద్వారా నీరు అందించేందుకు కృషి చేస్తున్నాం. ఈక్రమంలోనే కాలువలో పెరిగిన కంపచెట్లు, పూడికను తొలగిస్తున్నాం. రూ. 88 లక్షలతో చేపట్టిన ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి.

- నాగార్జున, ఏఈ, మడకశిర

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



బ్రోచర్ విడుదల చేస్తున్న మునిసిపల్ చైర్మన్ తదితరులు

హిందూపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రజలు తమ ఇంటి వద్ద కనీసం ఒక మొక్కనైనా నాటి సంరక్షించాలని మునిసిపల్ చైర్మన్ రమేష్ సూచించారు. నింకంపల్లిలోని బాలయేసు కళాశాల ఎదురుగా చెత్తకుండీలు పెట్టే ప్రాంతంలో మంగళవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ చెత్తవేసే ప్రతి చోట మొక్కలు నాటి సంరక్షిస్తే మొక్కలు బాగా ఎదుగుతాయన్నారు. చెత్తనుంచి వచ్చే దుర్వాసన కూడా తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ బలరాంరెడ్డి, నాయకులు వెంకటేష్, పరుశురాం, పాఠశాల హెచ్ఎం పెన్నోబుళం తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్ విడుదల

ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0కు సంబంధించిన బ్రోచర్‌ను మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎంఏవై 1.0లో పూర్తికాని ఇళ్లను లబ్ధిదారులు త్వరతగతిన నిర్మించుకోవాలన్నారు. 2.0లో ఇళ్లులేని అర్హతగల లబ్ధిదారులకు ఈ పథకంలో ఇల్లు మంజూరు చేస్తారన్నారు. అదేవిధంగా సూర్యఘర్ యోజన లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ చంద్రమ్మ, హౌసింగ్ డీఈఈ శ్రీనివాస్, ఏఈ ఫణిరాజ్, నిమ్మకాయల రాము, రమేష్‌రెడ్డి, శరవనన్, రాఘవేంద్ర, మెప్మా అధికారి గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యుత్‌శాఖ ఉద్యోగులు

లేపాక్షి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్‌శాఖ ఉద్యోగులు మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు ఈనెల 15నుంచి తమ డిమాండ్లను నెరవేర్చే వరకు దశలవారీగా నిరసనలు వ్యక్తం చేస్తామన్నారు. ఈక్రమంలోనే మంగళవారం మధ్యాహ్నం భోజన విరామం సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఏడీ

హిందూపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేవనహళ్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆరోగ్యశాఖ అదనపు సంచాలకుడు (ఏడీ) డాక్టర్ అనిల్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఈనెల 17నుంచి అక్టోబరు 2వరకు చేపట్టనున్న స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆసుపత్రిలో అన్ని విభాగాలు తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి, నాగేంద్ర పద్మజ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

‘స్వస్త్ నారీ సశక్త్ పరివార్’పై అవగాహన

పరిగి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్వస్త్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్‌పై మహిళలకు బుధవారం నుంచి ఆగస్టు 2వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం గురించి వివరించడానికి మంగళవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, నర్సులకు డాక్టర్ స్వరూపరెడ్డి, డాక్టర్ నవీన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్ణయించిన తేదీల్లో గ్రామాల్లో వైద్యశిబిరం ఏర్పాటు చేస్తారన్నారు. పరీక్షలు నిర్వహించి, ప్రమాదకర జబ్బులు ఉన్నట్లైతే వైద్యం అందించి ఆసుపత్రికి తరలించాలని సూచించారు.

ఘనంగా మంత్రి సత్యకుమార్ జన్మదిన వేడుకలు



మంత్రి సత్యకుమార్ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న దృశ్యం

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎనుమల రామకృష్ణ, గోపీనాథ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్‌కట్ చేసి రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో అంగడి రామాంజనేయులు, రవికుమార్, హనుమంతుయాదవ్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

హిందూపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని మునిసిపల్ చైర్మన్‌రమేష్, టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మోడల్‌కాలనీ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో మౌలిక సదుపాయాలపై ఆ ప్రాంత ప్రజలు అడిగారు. మునిసిపల్ కమిషనర్ మల్లికార్జున, ఎమ్మెల్యే పీఏ వీరయ్య, టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలు, ధర్నాలకు అనుమతి తప్పనిసరి: సీఐ

మడకశిర టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి అని అర్బన్ సీఐ నాగేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ రాజకీయ పార్టీ వారు కాని నియోజకవర్గంతో పాటు మండల కేంద్రాలలో ఎలాంటి ర్యాలీలు, ధర్నాలు చేయాలన్న ముందుగా పోలీస్‌ల అనుమతి తీసుకోవాలని సూచించారు.

గాలికుంటు వ్యాధికి టీకా తప్పనిసరి

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకా తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధకశాఖ డీడీ ఏహెచ్ డాక్టర్ గిరిజ పేర్కొన్నారు. పట్టణంలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో మంగళవారం ఆమె పెనుకొండ డివిజన్‌లోని ఏవీహెచ్ ఏడీ, బీఎస్, ఏడీఎఎల్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 15నుంచి అక్టోబరు 15వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీ శ్రీరాములునాయక్, ఎల్ఎస్ఏ ప్రసాద్ పాల్గొన్నారు.

రైతులతో బ్యాంకు మేనేజర్ దురుసు ప్రవర్తన

రొద్దం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పంట రుణం కోసం వెళ్లిన ఇద్దరు రైతుల పట్ల మేనేజర్ దురుసుగా ప్రవర్తించిన సంఘటన మండలంలోని పెద్దమంతూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. రొద్దం మండల పరిధిలోని దందేపల్లి గ్రామానికి చెందిన సంపత్, వెంకటేశ్‌లకు తాత ముత్తాతల నుంచి సంక్రమించిన చెరో మూడెకరాల పొలం ఉంది. రెండు నెలల క్రితం వారి పేరుమీద 1బీ వచ్చింది. కానీ పట్టదారు పాసుపుస్తకం రాలేదు. దీంతో లోన్ కోసం వెళితే పట్టాదారు పాసుపుస్తకం ఉంటేనే క్రాప్‌లోన్ ఇస్తామని, 1బీలు మొహంపై విసిరేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వారు తమ ఇబ్బందులను ‘ఆంధ్రజ్యోతి’వద్ద వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ నిఖిల్‌కుమార్‌ను వివరణ కోరగా పట్టాదారు పాసుపుస్తకం ఉంటేనే క్రాప్ లోన్ ఇస్తానని లేదంటే ఇవ్వనని ఖరాకండిగా చెప్పారు.

ఫుట్‌బాల్ జిల్లా జట్టుకు ‘ఐకాన్’ విద్యార్థులు



జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల బృందం

పరిగి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఆర్డీటీ క్రీడా మైదానంలో సోమవారం నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో సేవామందిరం ఐకాన్ కళాశాల విద్యార్థులు యశశ్రీ, పావని, పల్లవి, శ్రీలత, హేమంత్ జిల్లాస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్‌కుమార్, బాబాఖాన్, ప్రిన్సిపాల్ బైరిశెట్టి, అకాడమిక్ డీన్ వెంకటనందన్, అశ్విని, పీడీలు శంకర్, కార్తీక్ తదితరులు మంగళవారం అభినందించారు.

వేతనాల కోసం సోలార్ నౌకర్ల ధర్నా

పావగడ, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలో తిరుమణి ప్రాంతంలో వివిధ సోలార్ పార్కుల్లో పని చేస్తున్న సోలార్ నౌకర్ల వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కెఎస్‌డీసీఎల్ కార్యాలయం ముందు సోలార్ కార్మికులు ధర్నా చేపట్టారు. సోలార్ పార్కు నిర్మాణ తొలిరోజుల్లో వేతనాలు, పీఎఫ్ నిధులు బోనస్‌తో కలిపి అందించేవారని, ప్రస్తుతం నెలసరి జీతాలు కూడా సరిగ్గా అందించడం లేదన్నారు. డీజీఎం ప్రకాశ్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు.

ఆరోగ్య కేంద్రం మార్పుపై నిరసన

హిందూపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రహమత్‌పురంలో ఉన్న ప్రైమరి హెల్త్ సెంటర్ ఇందిరానగర్‌కు బదిలీ చేయడంపై సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సీపీఐ, ఆటోనగర్, వీవర్స్‌కాలనీకి చెందిన ప్రజలు అక్కడకు చేరుకుని ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను రహమత్‌పురంలోనే కొనసాగించాలన్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ అన్నపూర్ణ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మారుతిరెడ్డి, సబిహా, కమల్‌బాషా, అనూష తదితరులు పాల్గొన్నారు.

మతి భ్రమించి మాట్లాడుతున్న జబ్బల

● కురుబ సంఘం నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

పెనుకొండ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాస్ మతిభ్రమించి మాట్లాడుతున్నాడని స్థానిక కురుబ సంఘం నాయకులు ఆయనపై ధ్వజమెత్తారు. స్థానిక సంఘం కార్యాలయంలో కురుబ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, దండు ఈశ్వరప్రసాద్, పెద్దన్న, అశ్వత్థనారాయణ, రామకృష్ణ, సిద్దలింగప్ప మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత కురుబ కులస్థురాలు కాదని, ఆమె సవిత చౌదరి అంటూ అక్టోబరు 5న తిరుపతిలో జరిగే భక్త కనకదాస విగ్రహావిష్కరణ నుంచి బహిష్కరిస్తున్నట్లు రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షుడు ప్రకటించడం బాధాకరమన్నారు. మంత్రిగా, కురుబ సంఘం నాయకురాలిగా అన్నివర్గాల నుంచి ప్రశంసలు పొందుతున్న మంత్రిని ఇష్టారాజ్యంగా మాట్లాడటం మంచిది కాదని హితవు పలికారు. కార్యక్రమంలో రవికుమార్, శివకుమార్, ముత్యాలప్ప, నంజుండ, సోమందేపల్లి అధ్యక్షుడు శ్రీనివాసులు, రాచూరు రామచంద్ర, ఆదినారాయణ, చంద్రగిరి నరేష్, గొల్లపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అవగాహన

సోమందేపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజనలో భాగంగా మొబైల్ లాగిన్, క్షేత్రస్థాయి కార్యక్రమంలో లబ్ధిదారులను అప్లోడ్ చేసే విధానంపై మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. సీడీపీఓ శాంతలక్ష్మి ఆధ్వర్యంలో నిపుణులు షాజహాన్ ద్వారా వారికి శిక్షణ ఇచ్చారు. గర్భవతులు తమ వివరాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఈ యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. సెప్టెంబరు 17నుంచి అక్టోబరు 16వరకు థీమ్స్ షెడ్యూల్‌పై వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లాపల్లిలో స్వచ్ఛత కార్యక్రమం



పాఠశాలలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గోరంట్ల, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపల్లి ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత, పక్వాడా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. హెచ్ఎం జయసింహారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత, ఓజోన్ పొర గురించి, పర్యావరణ పరిరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు.

దేవరహట్టికి చేరిన యూరియా

గుడిబండ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరహట్టి రైతు సేవాకేంద్రంలో యూరియా నిల్వ ఉంచినట్లు ఏఓ వీరనరేష్ తెలిపారు. రైతులు పట్టా పాసుపుస్తకం, వన్‌బీ, ఆధార్ తీసుకొచ్చి యూరియాను తీసుకెళ్లాలని సూచించారు.

ఆస్పత్రి కోసం స్థల పరిశీలన

పరిగి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటకూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి అధికారులు మంగళవారం స్థల పరిశీలన చేశారు. భవనం లేకపోవడంతో చాలా రోజుల నుంచి స్థానికంగా ఉండే ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రంలో ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. సమస్యను బీసీ సంక్షేమ శాఖమంత్రి సవితకు వివరించడంతో స్పందించిన ఆమె ఆస్పత్రి నిర్మాణానికి అవసరమైన స్థల పరిశీలన కోసం అధికారులను పంపారు. వారు ఊటకూరు గ్రామ సమీపంలో ఆరోగ్యకేంద్రం నిర్మాణానికి కేటాయించిన 1.2ఎకరాల భూమిని పరిశీలించారు. టీడీపీ మండల కన్వీనర్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. రూ.2కోట్లు నిధులు విడుదల కావడంతో త్వరలో నిర్మాణ పనులు చేపడతామంటు కన్వీనర్ తెలిపారు.

బీజేపీలోకి టీడీపీ నాయకుడు



రొద్దం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్. కొట్టాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అరుణ్‌చౌదరి సోమవారం విశాఖ పట్నంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డాను కలిసి ఆ పార్టీలో చేరారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

కుంట రికార్డులు పరిశీలించిన ఆర్డీఓ

రొద్దం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.లోచర్ల గ్రామంలోని ప్రైవేట్ కుంట రికార్డులను పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆయన కుంట రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆర్.లోచర్ల గ్రామానికి చెందిన నాగరాజరావు తమ కుటుంబానికి చెందిన సర్వేనంబరు 60లో 200ఎకరాల్లో కుంట ఉందని, ప్రభుత్వం ల్యాండ్ అక్విజేషన్ కింద 1989లో స్వాధీనం చేసుకుందని, పరిహారం ఇవ్వలేదని హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆర్డీఓ రికార్డులు పరిశీలించేందుకు విచ్చేశారు. 2019లో నాగరాజారావు హైకోర్టును ఆశ్రయించగా పూర్తి రికార్డులను కోర్టు కోరడంతో ఆదిశగా అధికారులు సమాయత్తం అయ్యారు. ఆయన వెంట తహసీల్దార్ ఉదయ్ శంకర్‌రాజు, డీటీ చంద్రశేఖర్, ఆర్ఐ లక్ష్మీదేవి, వీఆర్ఓ సూరి, అనిల్ ఉన్నారు.